
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 17 నవంబరు 2024



రోజంతా జడి

నగరమంతా తడి

6

జిల్లాను వరుసుడు వీడనంటున్నాడు. శనివారం కూడా వర్షం కురవడంతో జిల్లావాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నెల్లూరులో మధ్యాహ్నం వరకు విడతలవారీగా వర్షం కురవడంతో నగరవాసులు ఇక్కట్లు తప్పలేదు. రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు నిలబడటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు.

కర్షకుడి కష్టం..

డ్రోన్ తీర్చేనట!

డ్రోన్.. ఇప్పుడు అంతటా వినిపించే పదం ఇది. పెళ్లిళ్లు.. రాజకీయ పార్టీల సభలు, ప్రదర్శనలు, దేవుళ్ల ఊరేగింపులు, జాతరలు, ఇతర శుభకార్యాలను వీడియోలో బంధించేందుకు వాడే అత్యాధునిక పరికరం ఇది. ఒక్కమాటలో చెప్పాలంటే ఎగిరే యంత్రం అన్నమాట. ఇప్పుడిప్పుడే అన్ని రంగాల్లోకి దూసుకొస్తున్న ఈ డ్రోన్ వ్యవసాయంలోకీ అడుగిడుతోంది. పచ్చని చేనుపై రివ్వున ఎగురుతూ నిమిషాల వ్యవధిలో పొలాన్ని చుట్టేస్తుంది. పైరును ఆశించిన పురుగుతోపాటు వైరస్‌ను నాశనం చేసే క్రిమిసంహారక మందులను పిచికారీ చేస్తుంది. దీనివల్ల కూలీల ఖర్చు, పెట్టుబడి వ్యయం తగ్గడంతోపాటు సమయం ఆదా అవుతుంది. కూటమి ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వ్యవసాయ శాఖ రైతులకు డ్రోన్‌లు అందించేందుకు కసరత్తు చేస్తోంది.

6



మనం సేఫ్!

● నెల్లూరులో అదుపులోనే కాలుష్యం

దేశ రాజధాని న్యూఢిల్లీలో ప్రమాద స్థాయికి కాలుష్య కోరలు సాచడంతో దేశ వ్యాప్తంగా ఆందోళన మొ దలైంది. దీపావళి తర్వాతే కాలుష్యం ఎక్కువైనట్టు పలు సర్వేలు వ్యక్తం చేశాయి. భవిష్యత్తుతరాలకు ఇది ప్రాణసంకటంగా మారడంతో నిపుణులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో నెల్లూరు నగరం మాత్రం సేఫ్ జోన్‌లోనే ఉన్నట్లు వాయుకాలుష్య నియంత్రణ మండలి అధికారి ఒకరు వెల్లడించారు. పీఎం10ను 60 మైక్రోగ్రాములు దాటితే ఆందోళన చెందాల్సి ఉండగా ప్రస్తుతం 52 మైక్రో గ్రాములే ఉంది. కావట్టి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. 2019 కరోనా సమయంలో ఏకంగా 66ఎంజీ ఉన్న వాయుకాలుష్యం ఆ తర్వాత తగ్గుతూ 2023లో 52.1 ఎంజీ నుంచి ప్రస్తుతం 52 ఎంజీకి చేరింది. కానీ ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని, దీనిని ఎంత తగ్గించుకుంటే మనకు అంత మంచిదని సదరు అధికారి వెల్లడించారు.


- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)



14,834 ఎకరాలు స్వాహా

● ఫ్రీ హోల్డ్ మాటున భారీ భూ కుంభకోణం
● పెద్దల పేర్లపైకి పేదల భూములు
● అందులో 14,552 అసైన్మెంట్ భూములే
● అక్రమ మార్గంలో 281 ఎకరాల చుక్కల భూములు మార్పు

అధికారుల విచారణలో వెలుగులోకి.. ప్రభుత్వానికి నివేదిక



జిల్లా చరిత్రలో కనీవినీ ఎరుగని భూ కుంభకోణం ఇది. నాడు అధికారమే అండగా వైసీపీ నేతలు సాగించిన భూ బాగోతం ఇప్పుడు వెలుగు చూసింది. ఒకటి కాదు.. రెండు కాదు.... ఏకంగా 14,834.49 ఎకరాలను దొడ్డిదారిన చెరబట్టారు. ఫ్రీ హోల్డ్ జీవో మాటున పేదల భూములను స్వాహా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫ్రీ హోల్డ్ భూములపై విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా జరిగిన విచారణలో 14,834.49 ఎకరాలను నిబంధనలకు విరుద్ధంగా పట్టా భూములుగా మార్చినట్లు తేల్చారు. ఇంత భారీస్థాయిలో అక్రమాలు జరగడాన్ని చూసి జిల్లా ఉన్నతాధికారులే నివ్వెరపోయారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

గతంలో పేదలకు ఇచ్చిన అసైన్మెంట్ భూములను (సుమారు 55,447 ఎకరాలు) పట్టా భూములుగా మార్చి నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు ఫ్రీ హోల్డ్ పేరుతో గత వైసీపీ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అసైన్మెంట్ చేసి 20 ఏళ్లు దాటిన భూములను ఫ్రీ హోల్డ్ కిందకు తీసుకు రావాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి కొన్ని నిబంధనలను విధించింది. 20 ఏళ్ల క్రితం అసైన్మెంట్ భూములు పొంది ఇప్పటికీ సాగు చేసుకుంటున్న ఒరిజినల్ అసైనీదారులు వారి కుటుంబ సభ్యులకు మాత్రమే ఫ్రీ హోల్డ్ హక్కులు కల్పించాల్సి ఉంది. ఇతరులు సాగు చేసుకుంటున్న ఆ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించకూడదు. అయితే ఇందుకు విరుద్ధంగా 14,552.87 ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించి పట్టా భూముల హక్కులు కల్పించారు. ఇందులో చాలా వరకు ఒరిజినల్ హక్కుదారులు లేరు.

పలువురు వైసీపీ నేతలు, భూస్వాములు ఒరిజినల్ అసైనీదారుల మాటున వారి పేర్లపైకి భూములు మార్పు చేసుకున్నారు. మరికొన్ని భూములు 20 ఏళ్లు దాటకపోయిన వాటిని కూడా నిషేధిత జాబితా నుంచి తొలగించి పట్టా హక్కులను కట్టబెట్టారు. ఇవేగాక అనేక రకాల అక్రమాలు ఈ అసైన్మెంట్ భూముల మాటున జరిగినట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. కాగా ఫ్రీ హోల్డ్ జీవో ప్రకారం చుక్కల భూములను కూడా 22ఏ జాబితా నుంచి తొలగించి, 281.62 ఎకరాలకు నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీ హోల్డ్ హక్కులు కల్పించారు.

● గ్రామసభలు లేకనే..

అసైన్మెంట్ భూములకు సంబంధించి ఎటువంటి నిర్ణయం తీసుకున్నా ముందుగా గ్రామసభలు నిర్వహిస్తారు. అప్పుడే వాస్తవాలు వెలుగు చూస్తాయి. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామసభలు నిర్వహించకుండానే నిర్వహించినట్లుగా చూపించి ఫ్రీ హోల్డ్ జాబితాను ఆమోదించారు. దీనిపై మొదటినుంచీ విమర్శలు వెలువెత్తినా నాడు పట్టించుకోలేదు. గ్రామసభలు నిర్వహిస్తే ఒరిజినల్ అసైనిదారులు ఎవరు? వారి వారసులు ఎవరు? ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఆ భూములు ఉన్నాయి.. ఈ భూములు ఫ్రీ హోల్డ్ హక్కులకు అర్హత పొందుతాయా!? వంటి వివరాలు స్పష్టమవుతాయి. దీంతో అక్రమాలు జరిగేందుకు అవకాశం ఉండదు. అయితే వైసీపీ నేతలకు దోచిపెట్టేందుకే కీలకమైన గ్రామసభలు నిర్వహించలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

● ప్రభుత్వ నిర్ణయం ఎటు!

ఫ్రీ హోల్డ్ మాటున జరిగిన భూ అక్రమాలపై కూటమి ప్రభుత్వ నిర్ణయం పైనే ఆసక్తిగా మారింది. ఇప్పటికే విచారణ పూర్తి చేసిన జిల్లా ఉన్నతాధికారులు ఆ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందించారు. దాదాపుగా ప్రతి మండలంలోనూ అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయింది. వందల మంది రెవెన్యూ సిబ్బంది పాత్ర ఇక్కడ కనిపిస్తోంది. ఇప్పుడు వారందరికీ భయం పట్టుకుంది. కాగా నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూములను తిరిగి ఆ జాబితాలోకి చేరుస్తారా!? అసైన్మెంట్ చట్టం (పీవోటీ) ప్రకారం ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంటుందా అన్నది ఉత్కంఠగా మారింది.



అవకతవకలు గుర్తించాం

ఫ్రీ హోల్డ్ భూములపై విచారణ పూర్తి చేశాం. అసైన్మెంట్ భూములకు సంబంధించి అవకతవకలను గుర్తించాం. ఈ నివేదికలను ప్రభుత్వానికి అందజేస్తున్నాము. ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకోనున్నాము.

కే కార్తీక్, జాయింట్ కలెక్టర్

పూర్తికాని పనులు..

నీటి కోసం పాట్లు

● మెట్టప్రాంతంలో ఊరిస్తున్న రిజర్వాయర్లు
● రోజులు గడుస్తున్నా పూర్తికాని పనులు
● రైతుల ఆశలన్నీ కూటమి ప్రభుత్వంపైనే!

నెల్లూరు- ప్రకాశం జిల్లాల్లోని మెట్టప్రాంతాలకు వరప్రసాదినిగా చెప్పుకొనే రిజర్వాయర్లు ఏళ్ల తరబడి నిర్మాణాలకు నోచుకోవడం లేదు. ప్రధానంగా ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలకు పెద్దిరెడ్డిపల్లి వద్ద నిర్మిస్తున్న వెలుగొండలో అంతర్భాగమైన పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు తొలుత జోరుగా సాగినా క్రమేణా నత్తనడకన సాగుతూ ప్రస్తుతం నిలిచిపోయాయి. ఇప్పటికే పలుమార్లు గడువు పెంచినా ఏమాత్రం ఫలితం లేకపోగా ఇంతవరకు జరిగిన పనులను పరిశీలిస్తే ఎన్నటికీ పూర్తయ్యేనో అన్న అనుమానాలు ఈ ప్రాంత వాసులను వేధిస్తున్నాయి.

వరికుంటపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు, ప్రకాశం, వైఎస్ఆర్ కడప జిల్లాల్లోని మెట్ట ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వెలుగొండ ప్రాజెక్టు పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అందులో భాగంగా 1,650 మీటర్ల పొడవు, 32 మీటర్ల ఎత్తుతో పెద్దిరెడ్డిపల్లి వద్ద నిర్మాణం చేపట్టిన ప్రాజెక్టులో ప్రకాశం జిల్లాలోని వెలుగొండ ప్రాజెక్టు పడమటి కాలువ నుంచి 2.501 టీఎంసీల నీటిని నిల్వ ఉంచేలా రూపకల్పన చేశారు. ఇక్కడ నుంచి ఆ నీటిని ఆయా నియోజకవర్గాల పరిధిలోని 65వేల ఎకరాలకు సాగునీరు, 1.5 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించనున్నారు. వరికుంటపాడు మండలంలో 13వేల ఎకరాలు, ఉదయగిరిలో 11వేలు, దుత్తలూరులో 20వేల ఎకరాలతోపాటు ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడు మండలంలో 21వేల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళికలు రూపొందించారు. ఈ నేపథ్యంలో రూ.1100 కోట్లతో పెద్దిరెడ్డిపల్లి వద్ద చేపట్టిన ప్రాజెక్టుకు 2007లో అప్పటి ఎంపీ, ఎమ్మెల్యేలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేయగా 2009లో పనులు ప్రారంభమయ్యాయి. తొలుత జోరుగా సాగిన పనులను చూసిన రైతులు, ప్రజలు ఇక తమ కష్టాలు తీరినట్లేనని సంబరపడ్డారు. 2012 వరకు అదేజోరుగా సాగిన పనులు ఆపై క్రమేణా నిధులు లేకపోవడంతో 2016 వరకు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో వాయిదాలపర్వం కొనసాగిస్తూ చివరికి గతేడాది సెప్టెంబరు నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశాలు వెలువడినా ఫలితం లేకుండా పోయింది.

● నక్కలగండిపై నిర్లక్ష్యం

అదేవిధంగా నక్కలగండి రిజార్వయర్ ఆదునికీకరణ పనుల్లోనూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరంచారనే విమర్శలు ఉన్నాయి. 1954లో నిర్మాణానికి రూపకల్పన చేసిన ఆ రిజర్వాయర్ పరిధిలో 1200 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. 1989 సంభవించిన పెను తుపాను కారణంగా ఆ రిజర్వాయర్ కట్ట తెగిపోయింది. దీంతో 1996లో విడుదలైన రూ.2కోట్లతో తిరిగి రూపకల్పన

- మిగతా 6లో..



పూర్తికాని పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ పనులు



గండిపాళెం జలాశయ కాలువ దుస్థితి

సోమేశ్వరాలయ పునఃనిర్మాణం

అట్టహాసంగా భూమిపూజ

పాల్గొన్న విధుశేఖర భారతి, మంత్రి ఆనం



ఆలయ నిర్మాణ భూమి పూజలో పాల్గొన్న విధుశేఖర భారతి, మంత్రి ఆనం

- వివరాలు 6లో..

కుటుంబాల లెక్క

నత్తనడకన జియో ట్యాగింగ్ సర్వే

తప్పుతోంది!

● సెలవుల్లో సచివాలయ సిబ్బంది
● పనిచేయని మొబైళ్లు, వేలిముద్ర డివైజ్‌లు
● జిల్లాలో 8,47,538 కుటుంబాలు.. సర్వే పూర్తయ్యింది 3,39,700
● 25 వరకు గడువు పొడిగింపు

గ్రామ, పట్టణ ప్రాంతాలలో ప్రతి ఇంటిని జియోట్యాగింగ్ (మ్యాపింగ్) చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన హౌస్‌హోల్డ్ జియోట్యాగింగ్ సర్వే జిల్లాలో నత్తనడకన సాగుతోంది. వాస్తవానికి ఈ నెల 15వ తేదీ నాటికల్లా సర్వే పూర్తి చేయాల్సి ఉంది. అయితే, అనుకున్న స్థాయిలో సర్వే జరగక పోవడంతో 25వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిసింది. కాగా, సర్వేకు కొందరు సచివాలయ ఉద్యోగులు దూరంగా ఉండటం, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ల పర్యవేక్షణ అరకొరగా ఉండటంతో నత్తేనయం అనేలా జిల్లాలో సర్వే సాగుతోంది.

- నెల్లూరు (హరినాథపురం, ఆంధ్రజ్యోతి)

జిల్లావ్యాప్తంగా మొత్తం 8,47,538 కుటుంబాలు ఉండగా, ఇప్పటివరకు 3,39,700 కుటుంబాల సర్వే (40 శాతం) పూర్తయింది. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో 1,87,637 కుటుంబాలు ఉంటే అందులో 61,265 కుటుంబాల సర్వే (30 శాతం) మాత్రమే పూర్తయింది. సచివాలయ క్లస్టర్ వారీగా ఈ సర్వే జరుగుతుండగా, కొన్ని క్లస్టర్ల పరిధిలో కొన్ని కుటుంబాలు కనిపించనట్లు సమాచారం.

● 769 సచివాలయాలు

జిల్లాలో 769 గ్రామ, వార్డు సచివాలయాలు ఉండగా, 5,500 మందికి పైబడి సిబ్బంది పని చేస్తున్నారు. వీరిలో కొందరు సర్వే చేయకుండా తప్పించుకుని తిరుగుతున్నట్లు సమాచారం. మరో 500మందికిపైగా ఉన్నత ఉద్యోగ పరీక్షలంటూ సెలవుపై వెళ్లినట్లు తెలిసింది. వీరి పరిధిలో చేయాల్సిన కుటుంబ సర్వేను ఆ సచివాలయంలో మిగిలిన ఉద్యోగులు చేయాల్సి రావటం వారికి భారంగా మారింది. గతంలో ఈ సచివాలయాల్లో 13,295 మంది వలంటీర్లు పనిచేసేవారు. వీరు ఒక్కొక్కరు 50 ఇళ్లను తీసుకుని గతంలో కుటుంబ మ్యాపింగ్ చేశారు. అయితే, స్థానికంగా కుటుంబాలు లేకపోయినా వలంటీర్లు ఉన్నట్లు కుటుంబ మ్యాపింగ్ చేయడం ప్రస్తుతం సమస్యకు దారి తీసింది. సచివాలయ ఉద్యోగులు చేస్తున్న సర్వేలో వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. వేల కుటుంబాలు కనిపించనట్లు తెలుస్తోంది.

● అవస్థలెన్నో..

కూటమి ప్రభుత్వం ఈ సర్వే కోసం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో కుటుంబ వివరాలు పూర్తిగా నమోదు చేయాల్సి ఉంది. అయితే, వేలిముద్ర వేసేందుకు ఇచ్చిన డివైజ్‌లు పని చేయడం లేదు. కొన్ని ప్రాంతాలలో మొబైల్ నెట్‌వర్క్ సమస్య తలెత్తుతోంది. కొన్ని సచివాలయాల్లో పూర్తిస్థాయి సిబ్బంది లేరు. వలంటీర్లు ఉన్నప్పుడు 50 కుటుంబాలనే మ్యాపింగ్ చేశారని, ఇప్పుడు ఒక్కొక్కరు 500 కుటుంబాలకుపైగా సర్వే చేయాల్సి వస్తోందని సచివాలయ ఉద్యోగులు వాపోతున్నారు. వలంటీర్లు తిరిగి ఇచ్చేసిన మొబైళ్లు కూడా సరిగ్గా పనిచేయడం లేదని ఆవేదన చెందుతున్నారు. తమ సొంత మొబైల్‌ను వినియోగిస్తామంటే యాప్‌ల భారాన్ని అవితట్టుకోలేక పోతున్నాయని చెప్పారు. ట్యాబ్‌లు, మంచి స్టోరేజ్ ఉన్న సెల్‌ఫోన్లు, డివైజ్‌లను అందచేస్తే సర్వేను సమర్థవంతంగా పూర్తి చేస్తామని వారు చెప్పుకొస్తున్నారు. ఏది ఏమైనా ఈ సర్వే విషయంలో అధికారుల పర్యవేక్షణ పెంచి సర్వేను సత్వరమే పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.



నెల్లూరు నగరంలో కుటుంబ సభ్యులు వివరాలు సేకరిస్తున్న సచివాలయ ఉద్యోగులు

వేలిముద్ర వేయం

నెల్లూరు (సిటీ) : నగరంలో ఇంటింటా సర్వేకు వెళుతున్న సచివాలయ ఉద్యోగులకు వింత అనుభవాలు ఎదురవుతున్నాయి. నేటి సమాజంలో సైబర్ నేరగాళ్ల బెడద ఎక్కువగా ఉండటంతో పేద, మధ్యతరగతి ప్రజలు సర్వేకి వెళ్లిన ఉద్యోగులకు వేలిముద్రలు వేయమంటూ తెగేసి చెబుతున్నారు. తమ వివరాలు కావాలంటే తీసుకోండి.. కానీ బయోమెట్రిక్ మాత్రం వేయమని తెగేసి చెప్పేస్తున్నారు. ఇక ప్రభుత్వ ఉద్యోగులైతే ఇంటి వద్దకు కూడా సర్వే బృందాలను రానివ్వడం లేదన్న ఆవేదన సచివాలయ ఉద్యోగుల నుంచి వస్తోంది. తమకు ఎలాగూ ప్రభుత్వ పథకాలు, ఏ ఇతర లబ్ధి రాదు, కాబట్టి తాము ఎలాంటి వివరాలు, వేలిముద్రలు ఇవ్వమంటూ స్పష్టం చేస్తున్నారు. ఈ వరుసలో పోలీసు శాఖ మొదట్లో ఉన్నట్లు తెలుస్తుండగా ఐటీ చెల్లింపులు, కార్లు ఇతర వాహనాలు ఉన్న ప్రైవేట్ వ్యక్తులు కూడా తమ ఇళ్లకు సర్వే బృందాలను రానివ్వడం లేదని సచివాలయ ఉద్యోగులు వాపోతున్నారు.



దొంగలతో జాగ్రత్త సుమీ!

'దొంగల బెడద ఎక్కువవుతోంది. కొంచెం ఏమరుపాటుగా ఉంటే చాలు ఇల్లు, దుకాణాలు గుల్ల చేస్తున్నారు. కాబట్టి అందరూ జాగ్రత్తగా ఉండాలి. సీసీ కెమెరాలు, అలారం తాళాలు అమర్చుకోవాలి.' అంటూ పోలీసులు ప్రజలను హెచ్చరిస్తున్నారు. శనివారం ఉలవపాడు పోలీస్ స్టేషనులో ఎస్‌ఐ అంకమ్మ బంగారం వ్యాపారులతో సమావేశమై పలు దిశా నిర్దేశాలు చేశారు. ప్రధాన రహదారుల్లో వ్యాపార కేంద్రాలు ఉన్నందున చుట్టు పక్కల పరిసర ప్రాంతాలు, రహదారులు కవర్ అయ్యేలా సీసీ కెమెరాలు బిగించుకోవాలని, అలారం మోగే లాక్‌లు తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

- ఉలవపాడు (ఆంధ్రజ్యోతి)



ఆగని వాన

● తడిసి ముద్దవుతున్న నగరం

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి నెల్లూరు నగరం తడిచి ముద్దవుతోంది. చిరు, రోడ్డు మార్జిన్ వ్యాపారులు నష్టాలను చవిచూస్తుండగా, ఉద్యోగులు, కూలీలు, విద్యార్థులు బయటకు వెళ్లేందుకు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు వర్షపునీటికి అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీ కాలువలన్నీ వ్యర్థాలతో నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. కాగ శనివారం పడారుపల్లి వద్ద 24 మి.మీ, గాంధీబొమ్మ కూడలి, కార్పొరేషన్ కార్యాలయం 17, గాంధీనగర్ వద్ద 12, కరెంటాఫీసు కూడలి 7, సౌత్‌మోపూరు, మాదరాజుగూడూరు, బుజబుజనెల్లూరు 1-2 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. కాగ నెల్లూరురూరల్‌లోని పలు గ్రామాలలో 300 ఎకరాలకు సరిపడా నారుమళ్లు దెబ్బదిన్నట్లు రైతులు వాపోయారు.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)



డ్రోన్ తీర్చేనట!

కర్షకుడి కష్టం..

రాబోయేది డ్రోన్ల వ్యవసాయం.. ఇప్పటికే అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయ రంగం ముందుకు సాగుతోంది. దీనికితోడు కూటమి ప్రభుత్వం ఈ రంగానికి పెద్దపీట వేయడంతోపాటు భారీ బడ్జెట్ కేటాయించింది. గతంలో జరిగిన వ్యవసాయ శాఖ సమావేశంలోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు డ్రోన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు జిల్లా వ్యవసాయ శాఖ రైతులకు డ్రోన్‌లు అందించేందుకు కసరత్తు చేస్తోంది. అయితే, ఇప్పటికే జిల్లాలో కొంతమంది అద్దెప్రాతిపదికన డ్రోన్లను వినియోగించి మందులు పిచికారీ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వ నిర్ణయం అమలైతే ఇటు రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గడంతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరగనున్నాయి.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)



● తగ్గనున్న పెట్టుబడి వ్యయం.. కూలీల కొరతకూ చెక్!
● రైతులకు అందించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నం
● 40 శాతం రాయితీపై త్వరలో అందజేత?
● 28 మంది పైలెట్లకు పూర్తయిన శిక్షణ
● ఇప్పటికే అందుబాటులో ప్రైవేటు డ్రోన్లు

వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం కష్టంగా మారుతోంది. దీనికితోడు పెట్టుబడులు కూడా భారీగా పెరగడంతో రైతులకు ఆర్థిక భారం ఎక్కువవుతోంది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రైతులకు ఆధునిక సాంకేతికత అందించాల్సిన అవసరం ఏర్పడింది. ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే వ్యవసాయానికి అవసరమైన యంత్ర పరికరాలు వ్యక్తిగతంగా రైతులకు అందిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా డ్రోన్లను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. జిల్లాలో ఈ రబీ సీజన్‌లో దాదాపు 7లక్షల ఎకరాలకుపైగా సాగునీరు అందిస్తుండగా, ప్రధానంగా వరి సాగుకే రైతులు మొగ్గుచూపుతారు. చిన్న, సన్నకారు రైతులే ఎక్కువగా ఉన్న నేపథ్యంలో సాగు, పెట్టుబడి వ్యయం తగ్గించే దిశగా ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు సిద్ధమైంది. అందులో భాగంగా ఎరువులు, పురుగు మందులను పిచికారీ చేసేందుకు డ్రోన్లు ఇవ్వనుంది.

● ఇవిగో ప్రయోజనాలు..

ప్రస్తుత పరిస్థితుల్లో కూలీల కొరతను అధిగమించి రసాయనాలు పిచికారీ చేయడానికి డ్రోన్లు అందుబాటులోకి రానున్నాయి. ఒక డ్రోన్‌తో ఎకరాకు దాదాపుగా రూ.500 ఖర్చుతో మందులు పిచికారీ చేయవచ్చు. అదే సాధారణ స్ప్రేయరుతో అయితే సుమారు రూ.1500 వరకు ఖర్చవుతుంది. అంతేగాక డ్రోన్ల ద్వారా మందులు పిచికారీ చేయడం వల్ల దాదాపు 25 శాతం వరకు సమయం ఆదా అవుతుంది. నేలలో తేమ ఎక్కువగా ఉన్నా, వాతావరణం ప్రతికూలంగా ఉన్నా డ్రోన్‌తో పిచికారీకి ఇబ్బందులు ఉండవు. పంట మొత్తానికి ఒకే మోతాదులో రసాయనాలు చల్లడంతోపాటు అన్ని ప్రాంతాలు సమానంగా పిచికారీ జరుగుతుంది. తక్కువ నీరు, పరిమిత రసాయనాలతో సమర్థవంతంగా పిచికారీ చేయడం వల్ల చీడపీడలను అరికట్టవచ్చు. ఏ పంటకు ఏ దశలో ఎంత మోతాదులో పిచికారీ చేయాలో వ్యవసాయ శాఖ అధికారులు తెలియజేస్తారు. దీంతో రైతులకు శ్రమ తగ్గడంతోపాటు అనేక ప్రయోజనాలు కలుగుతాయి. కాగా, రూ.10లక్షలు విలువచేసే డ్రోన్‌ను ప్రభుత్వం 40 శాతం రాయితీపై రైతు సంఘాలకు ఇవ్వనుంది. మిగిలిన 60 శాతం నగదును సదరు సంఘాలు బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుంది.

● యువతకు ఉపాధి

జిల్లాలో ఇప్పటికే డ్రోన్లు అందుబాటులో ఉన్నాయి. కొంతమంది ఔత్సాహికులు అద్దెకు ఇస్తూ ఉపాధి పొందుతున్నారు. చీడపీడల నివారణకు రసాయనిక ఎరువులు చల్లేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నారు. పొదలకూరు, బుచ్చి, కోవూరు, కందుకూరు, ఆత్మకూరు, ఇందుకూరుపేట, మనుబోలు తదితర ప్రాంతాల్లో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు డ్రోన్లను వినియోగిస్తున్నారు. ఎకరాకు రూ.500 నుంచి రూ.600 వరకు తీసుకుని మందులు పిచికారీ చేస్తున్నారు. జిల్లాలో వ్యవసాయ శాఖ దాదాపు ఏడాది కిందటే 28 మంది డ్రోన్ పైలెట్లకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శిక్షణ కూడా ఇప్పించి సిద్ధం చేసింది. అయితే గత ప్రభుత్వం డ్రోన్లను అందించడంలో విఫలమైంది. రైతులు ఎంతో ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం డ్రోన్ల వినియోగానికి పెద్దపీట వేసింది. దీంతో ఇటు రైతులకు ఉపయుక్తం అటు యువతకు ఉపాధి అవకాశాలు కలగనున్నాయి.

మార్గదర్శకాలు రావాల్సి ఉంది

వ్యవసాయంలో డ్రోన్ల పాత్ర ఎంతో కీలకమైంది. సాంకేతిక పరిజ్ఞానానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ఇటీవల వ్యవసాయ యాంత్రీకరణకు సంబంధించి ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు చేసింది. ఇందులో డ్రోన్లకే ఎక్కువగా కేటాయించారు. అయితే మార్గదర్శకాలు ఇంకా రావాల్సి ఉంది. జిల్లాలో ఇప్పటికే 28 మంది పైలెట్లను ఎంపిక చేసి శిక్షణ కూడా పూర్తి చేయించాం. డ్రోన్ల బ్యాటరీ పరిస్థితిని బట్టి రూ.7లక్షల నుంచి 10లక్షల వరకు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. సబ్సిడీ, రైతు బృందాల వాటా వంటి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

- పి.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

హెవీ డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్‌కు
శిక్షణ తప్పనిసరి

● రాష్ట్రవ్యాప్తంగా మూడు సంస్థలకు బాధ్యతలు
● జిల్లాలో ఆర్టీసీ నెల్లూరు డిపో-1లో శిక్షణ
● ఆ సర్టిఫికెట్ ఆధారంగా లైసెన్స్ రెన్యూవల్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కాలం మారింది.. గతంలోలా బస్సులు, లారీలు వంటి హెవీ వాహనాల డ్రైవింగ్ చేసే విధానం మారిపోయింది. టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతున్న క్రమంలో వాహన రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ఈ క్రమంలో పాత వాహనాలతోపాటు నూతన టెక్నాలజీతో మార్కెట్‌లోకి వచ్చిన హెవీ వాహనాలను నడిపేలా రవాణా శాఖ అధికారులు వినూత్న ఆలోచనలకు తెరలేపారు. రవాణా శాఖ కమిషన్ ఉత్తర్వుల మేరకు ఈ ఏడాది ఏప్రిల్ తరువాత హెవీ డ్రైవింగ్ లైసెన్సు కాల పరిమితి ముగిసిన డ్రైవర్లు రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకోకుండా రవాణా శాఖ నిర్ధారించిన శిక్షణ కేంద్రాల్లో శిక్షణ పొంది సర్టిఫికెట్ తీసుకోవాలి. ఆ తర్వాత డ్రైవింగ్ టెస్ట్‌కు వచ్చే సమయంలో తప్పనిసరిగా ఆ సర్టిఫికేషన్ ఉంటేనే హెవీ లైసెన్స్ రెన్యూవల్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

● 3 సంస్థలకు శిక్షణ కేటాయింపు

రాష్ట్రంలో మూడు సంస్థలకు హెవీ డ్రైవింగ్ లైసెన్సు కలిగి రెన్యూవల్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి శిక్షణ ఇచ్చే బాధ్యతలను రవాణా శాఖ కేటాయించింది. అందులో భాగంగా ఆర్టీసీ సంస్థ, కృష్ణ జిల్లాలోని గన్నవరం అంబాపురంలోని లారీ అసోషియేషన్ డ్రైవింగ్ స్కూల్, నందిగామలోని పిసిబోస్ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందాల్సి ఉంటుంది. శిక్షణ పూర్తయ్యాక వారు ఇచ్చే సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా పొందాలి.



నెల్లూరు ఆర్టీసీ డిపోలో శిక్షణ పొందుతున్న డ్రైవర్లు

● నెల్లూరులో 1వ డిపోకు శిక్షణ బాధ్యతలు

ఇక జిల్లాకు సంబంధించి నెల్లూరు ఒకటవ డిపోలో డ్రైవర్లకు ఒకరోజు శిక్షణ ఇస్తున్నారు. ఇందుకుగాను రూ.1000 ఫీజు, జీఎస్టీ రూ.180లకుపైగా వసూలు చేస్తున్నారు. శిక్షణ పొందిన డ్రైవర్లు సర్టిఫికెట్ పొంది దాని ద్వారా హెవీ లైసెన్సు రెన్యూవల్‌కు దరఖాస్తు చేసుకొని టెస్ట్‌కు వెళ్లి లైసెన్సు పొందుతున్నారు. ఇప్పటివరకు నెల్లూరు రీజియన్ పరిధిలో 169 మంది ఒకటవ డిపోలో శిక్షణ పొందారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు ప్రారంభం

కందుకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సబ్ జూనియర్ బాలికల రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు శనివారం పట్టణంలోని ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో వైభవంగా ప్రారంభమయ్యాయి. వివిధ జిల్లాల నుంచి 300 మందికిపైగా క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్కే. అబ్దుల్ సలాం నేతృత్వంలో కందుకూరు డీఎస్పీ సీహెచ్ సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా కార్యక్రమానికి హాజరై కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్యతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. మహిళల స్వీయరక్షణకు ఈ పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తైక్వాండో సంఘం కార్యదర్శి ఎల్‌టీ చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఛైర్మన్ ఉన్నం భాస్కరరావు, గోనుగుంట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్నడీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తదితరులు

నీటికోసం పాట్లు

(5వ పేజీ తరువాయి)

చేశారు. అలాగే 2018లో విడుదలైన రూ.2.96 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులతో కాంక్రీటు గోడతో సహా కుడి, ఎడుమ కాలువలకు మరమ్మతు చేయాల్సి ఉంది. 2020, జూన్ నాటికి పూర్తి చేయాల్సి ఉన్నా పనులు అర్థంతరంగా నిలిచిపోయాయి. వీటికితోడు సమీప ఉదయగిరి మండలం గండిపాళెంలో 16వేల ఎకరాల విస్తీర్ణం పరిధిలో 1975లో నిర్మించిన రిజర్వాయర్ పరిస్థితి కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ఈ తరుణంలో రూ.25 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టిన కాలువల మరమ్మతు పనులు ఆశించిన మేర ముందుకు సాగక పోవడం రైతులకు శాపంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతోపాటు పర్యవేక్షణ బాధ్యతలను గాలికి వదిలివేయడంతో ఇలాంటి పరిస్థితి దాపురించిదనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. దీంతో చేసేది లేక కరువు కోరల్లో చిక్కుకున్న ప్రజలు, రైతులు తమ వ్యవసాయ భూములను అమ్ముకొని బతుకు బండి సాగించేందుకు వలసబాట పట్టాల్సిన దుస్థితి నెలకొంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పెద్దలైనా రాజర్వాయర్ పనులను పూర్తిచేసి తాగు, సాగునీటి బాధలు తీర్చాలని మెట్టప్రాంత ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.



ముందుకు సాగని నక్కలగండి కాలువ పనులు

గిరిజనులు ఉన్నత స్థితికి ఎదగాలి

● రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ కార్యక్రమాలను వినియోగించుకుని గిరిజనులు ఉన్నత స్థితికి ఎదగాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ కోరారు. శనివారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా యానాది కుటుంబాలకు ఆధార్, రేషన్‌కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలు లేవని తన దృష్టికి వచ్చినట్లు చెప్పారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి గిరిజనులకు ఆధార్ కార్డులు ఇప్పించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 40 శాతం మంది గిరిజనులకు నరేగా జాబ్‌కార్డులు లేవని, అలాగే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు, విచారణలో జాప్యం జరుగుతోందని, ఆయా కేసుల్లో బాధితులకు నష్ట పరిహారం సత్వరమే అందచేయాలని అధికారులకు సూచించారు. ఇలాంటి కేసుల విషయంలో కోర్టుకు హాజరయ్యే బాధితులకు నిబంధనల ప్రకారం రవాణా ఖర్చులు చెల్లించాలన్నారు. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమాధికారి పరిమళ, ఎస్టీ సంఘాల నాయకులు పెంచలయ్య, రఘు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన కలెక్టర్ ఆనంద్‌తో సమావేశమై, జిల్లాలో గిరిజనుల సమస్యలపై చర్చించారు. అలాగే నెల్లూరు ఆర్డీవో అనూష కూడా వడిత్యా శంకర్ నాయక్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ జి కృష్ణకాంత్‌ను శంకర్‌నాయక్ కలిసి, పలు అంశాలపై చర్చించారు.

● చట్టాలపై గిరిజనుల్లో అవగాహన పెంపొందించాలి

నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి) : ఎస్సీ ఎస్టీ చట్టాలపై గిరిజనుల్లో అవగాహన పెంపొందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్ సూచించారు. శనివారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో సీఐడీ పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐడీ, నగర డీఎస్పీలు ఎన్ కోటారెడ్డి, డి శ్రీనివాసరెడ్డి, నెల్లూరు రూరల్ తాహసీల్దారు డి లాజరస్, ఇన్‌స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ ఆనంద్‌తో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్

సోమేశ్వరాలయ పునఃనిర్మాణం

● అట్టహాసంగా భూమిపూజ ● పాల్గొన్న విధుశేఖర భారతి, మంత్రి ఆనం

అనంతసాగరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్ల క్రితం సంభవించిన వరదలకు ధ్వంసమైన సోమశిలలోని సోమేశ్వరుడి ఆలయ పునఃనిర్మాణానికి శనివారం రాత్రి భక్తిశ్రద్ధలతో భూమి పూజ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శృంగేరి శారదాపీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పూజలు అనంతరం విధుశేఖర భారతి మాట్లాడుతూ మంత్రి ఆనం ధ్రుఢ సంకల్పంతో అత్యంత ప్రాచీనమైన సోమేశ్వరుడి ఆలయ నిర్మాణానికి కృషి చేస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరు సేవాదృక్పథం కలిగి పరులకు ఉపకారిగా ఉండాలని సందేశం ఇచ్చారు. అనంతరం మంత్రి ఆనం మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి విషయంలో గత వైసీపీ పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు సహకారంతో ఆలయ పునఃనిర్మాణం జరుగుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ఉప్పల విజయ్ కుమార్, సోమసుందరమూర్తి, నాయకులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణ భూమి పూజలో విధుశేఖర భారతి, మంత్రి

● పెంచలస్వామిని దర్శించుకున్న విధుశేఖర భారతి

రాపూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామిని శ్రీ శృంగేరి శారదా పీఠాధిపతి విధుశేఖర భారతి స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఆలయ అర్చకులు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం విధుశేఖర భారతిస్వామిని ఆలయ అర్చకులు, అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెంచలకోన దేవస్థానం కార్యనిర్వహణ అధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, గండి ఆంజనేయ స్వామి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ జొల్లు వెంకట సుబ్బయ్య, ఆత్మకూ రు డీఎస్పీ వేణుగోపాల్, రాపూరు సీఐ విజయకృష్ణ, ఎస్‌ఐ వెంకటరాజేష్, తదితరులు పాల్గొన్నారు.

● నేడు కొండబిట్రగుంటకు.....

కావలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర శృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి స్వామి, రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి ఆదివారం సాయంత్రం 4గంటలకు నియోజకవర్గంలోని బోగోలు మండలం కొండబిట్రగుంట శ్రీప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి వస్తున్నట్లు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో ఆలయ ప్రాకారం, గాలి గోపురాలకు శృంగేర పీఠాధిపతి శంకుస్థాపనలు చేయనున్నట్లు పేర్కొన్నారు. సంప్రదాయ దుస్తులతో భక్తులు కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు.

రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రికి రూ.5 లక్షల వితరణ

నెల్లూరు(వైద్యం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రికి రేడియాథెరపీ విభాగానికి సత్యాస్ బ్లూ థింకింగ్ ఈక్విటబుల్ సొసైటీ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ యాచమనేని బృంద, పాకాల శ్రీవల్లి, పాకాల శ్రీకాంత్, చేడిమాల ఉమారాణిలు రూ.5 లక్షల విరాళం అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కును శనివారం కేన్సర్ ఆసుపత్రిలో జనరల్ మేనేజర్ భక్తవత్సలరెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వరరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోశాధికారి సురేష్‌కుమార్ జైన్, మేనేజింగ్ కమిటీ సభ్యులు వాకాటి విజయ్‌కుమార్‌రెడ్డి, యాలమూరి రంగయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ నాగేశ్వరరావుకు చెక్కు అందజేస్తున్న దాతలు బృంద, శ్రీవల్లి తదితరులు



ఎన్నాళ్లీ దుస్థితి..!

మనుబోలు మండలంలోని మారుమూల తీరప్రాంతమైన కొలనుకుదురు దళితవాడలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోకి వర్షాలు కురిసినప్పుడల్లా నీరుచేరుతోంది. అయితే అంగన్‌వాడీ కేంద్రం కాస్త ఎత్తులో ఉండడంతో పాఠశాలను మూసేసి పిల్లలు ఇబ్బంది పడకుండా అందులో పాఠాలు చెబుతారు. దీంతో ఎన్నాళ్లీ దుస్థితి అంటూ కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు ఇలా ఉండడంతో పిల్లలకు ప్రమాదమని భావించి తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారు. సత్వరమే అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలంటూ కాలనీవాసులు శనివారం ఆందోళన చేశారు.

- మనుబోలు (ఆంధ్రజ్యోతి)

మినీలను మెయిన్ చేయాలి

● కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా

జిల్లాలో మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేస్తూ శనివారం మినీ అంగన్‌వాడీ కేంద్రాల వర్కర్లు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అంగన్‌వాడీ మినీ వర్కర్ల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మినీ అంగన్‌వాడీలకు వేసవి సెలవులు ఇవ్వాలని, పదోన్నతులు కల్పించాలని, మెయిన్ అంగన్ వాడీ వర్కర్లతో సమానంగా వేతనం ఇవ్వాలని కోరారు. గ్రేడ్-2 సూపర్‌వైజర్ పోస్టుల భర్తీలో మినీ వర్కర్లకు అవకాశం కల్పించాలని, సర్వీసులో ఉండి చనిపోయిన వారికి మట్టి ఖర్చుల జీవో వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు సుజాతమ్మ, కార్యదర్శి రెహనా బేగం తదితరులు పాల్గొన్నారు.

- నెల్లూరు(హరనాథపురం,ఆంధ్రజ్యోతి)



నేర వార్తలు

అడవిలో ఉరేసుకుని
యువకుడి ఆత్మహత్య

వెంకటాచలం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలిచెర్లపాడు సమీపంలో ఉన్న అడవిలో ఒక వ్యక్తి ఉరివేసుకుని శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు నగరంలోని జాకీర్ హుస్సేన్ నగర్ ప్రాంతానికి చెందిన గండికోట సురేంద్రబాబు (36) చెట్టుకు తాడుతో ఉరి వేసుకుని మృతిచెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకొని మృతుడికి సంబంధించిన మోటార్‌బైక్‌ను గుర్తించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



చెట్టుకు వేలాడుతున్న సురేంద్రబాబు మృతదేహం

● చికిత్స పొందుతూ యువకుడు మృతి

మండలంలోని నిడిగుంటపాళెం గ్రామంలో గడ్డి మందు తాగిన ఒక యువకుడు చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం ఏరూరు గ్రామానికి చెందిన బండి పాపయ్య (27) నిడిగుంటపాళెంలోని తన బంధువుల ఇంటికి వచ్చాడు. అయితే రెండు రోజుల కిందట గడ్డిమందు తాగిన పాపయ్యను చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

● కసుమూరులో వృద్ధుడు..

ఓ గుర్తుతెలియని వృద్ధుడు చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుర్తుతెలియని వృద్ధుడు గత కొద్దిరోజులుగా కసుమూరు దర్గా వద్ద ఉంటున్నాడు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో స్థానికులు చికిత్స నిమిత్తం నెల్లూరులోని జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో ఒకరి అరెస్ట్

నెల్లూరురూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని శనివారం నెల్లూరురూరల్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ జీ వేణు తెలిపిన వివరాలు మేరకు.. మెడికవర్ ఆసుపత్రి సమీపంలోని పాతమెట్టపాళెంకు చెందిన 10వ తరతగతి చదువుతున్న 16 ఏళ్ల బాలికకు అదే ప్రాంతానికి చెందిన గోడ పెంచలయ్య ఈనెల 14వ తేదీన మాయమాటలు చెప్పి బయటకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో అది వాస్తవం అని తేలడంతో అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ మేరకు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

మహిళపై దాడి

నెల్లూరు(క్రైం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పాత గొడవల నేపథ్యంలో మహిళపై దాడి చేసిన ఘటన నగరంలోని సప్తగిరి కాలనీలో శనివారం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. సప్తగిరి కాలనీలో వెంకటనాగలక్ష్మి కుటుంబం నివాసం ఉంటోంది. పార్కింగ్, పూల మొక్కల విషయంలో పక్కింట్లో ఉంటున్న వెంకటేష్ కుటుంబంతో ఆమెకు పాతగొడవలున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం ఆమె తన ఇంటి ముందు శుభ్రం చేసుకుంటూ ఉండగా వెంకటనాగలక్ష్మిపై వెంకటేష్ దాడి చేసి చంపుతానని బెదిరించాడు. ఈ మేరకు బాధితురాలు వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కావలి కోర్టులో గుంటూరు వాసి హాజరు

కావలి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన గుంటూరు వాసి మేకా వెంకట్రామిరెడ్డి ని 1వ పట్టణ ఎస్‌ఐ సుమన్ శనివారం కావలి కోర్టుకు హాజరుపర్చారు. పోలీసుల వివరాల మేరకు.. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వెంకట్రా మిరెడ్డిని గుంటూరు నగరపాలెం పోలీసులు అరెస్ట్ చేసి రాజమండ్రి జైలుకు తరలించారు. అలాగే పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు దావులూరి దేవకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు కావలి కోర్టులో హాజరుపరిచిన అనంతరం సబ్ జైలుకు తరలించారు.

బ్లాక్ స్పాట్ల పరిశీలన

సంగం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 67వ నెంబరు ముంబయి జాతీయ రహదారిపై తరుచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి బ్లాక్ స్పాట్‌లను శనివారం రోడ్డు హైవే అథారిటీ, వాహన తనిఖీ, పోలీసు అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆత్మకూరు వాహన తనిఖీ అధికారి రాములు మాట్లాడుతూ దువ్వూరు, పెరమన క్రాస్ రోడ్డు సమీపంలో రెండు చోట్ల తరుచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించి నివారణ చర్యలు చేపట్టేందుకు పరిశీలించామన్నారు. మోటారుబైక్‌లు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రాజేష్, హైవే అథారిటీ అధికారులు పాల్గొన్నారు.



రహదారి బ్లాక్‌స్పాట్‌లను పరిశీలిస్తున్న హైవే అథారిటీ, వాహన తనిఖీ అధికారులు

బీసీ స్టడీ సర్కిల్‌లో డీఎస్సీ శిక్షణ ప్రారంభం

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్షకు బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమం శని వారం నగరంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ప్రారంభమైంది. ఈ శిక్షణకు దర ఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ హాజరయ్యారు. వివిధ సబ్జెక్టులకు సంబంధించి అధ్యాపకులు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమా ధికారి ప్రసూన, కుట్టి కోచింగ్ సెంటర్ అధినేత లతీఫ్‌కుట్టి పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	105
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	196
స్కిన్‌లెస్	220
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7143
వెండి కిలో ధర	రూ. 90,900
వెండి ఒక గ్రాము	రూ.93.90

డిగ్రీ పరీక్షలకు ఇద్దరు గైర్హాజరు

వెంకటాచలం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూని వర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో శనివారం మధ్యాహ్నం జరి గిన డిగ్రీ మూడవ సెమిస్టర్ పరీక్షలకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటన లో తెలిపారు. మొత్తం 89 మంది విద్యార్థులకు గాను 87 మంది పరీక్షలకు హాజరయ్యారన్నారు.

నేడు ప్రపంచ ప్రీమెచ్యూరిటీ డే

నెలలు తక్కువైతే కంగారూల్లా కాపాడాలి

సాధారణంగా మహిళ గర్భం దాల్చిన తర్వాత 37 వారాలకు ప్రసవం అవుతుంది. అంతకంటే ముందే కాన్పు జరగడం వల్ల నెలలు తక్కువతో పుట్టే పిల్లలు ఎన్నో ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇవి వారి ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. అవయవ లోపానికీ కారణ మవుతాయి. ఇటువంటి నవజాత శిశువులను కంగారూ జంతువుల్లా కాపాడుకోవాలనేది వైద్య నిపుణుల సూచన. జిల్లాలో ఏటా 40 వేల మంది పిల్లలు పుడుతుండగా వారిలో 20 శాతం నెలల తక్కువ (ప్రీమెచ్యూర్) వారుంటున్నారు. వీరిలోనూ సుమారు 200 మంది పొత్తిళ్లలోనే మృత్యువాత పడుతుండటం ఆందోళన కలిగించే అంశం.



● జిల్లాలో ఏటా 40 వేల ప్రసవాలు ● 20 శాతం నెలలు తక్కువ పిల్లలే!
● వారిలో 5 శాతం మందికి తీవ్ర అనారోగ్యం ● 200 మందికిపైగా మృత్యువాత
● గర్భవతుల అప్రమత్తతతో ముందస్తు కాన్పు నిరోధం

నెల్లూరు (వైద్యం), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తల్లికి అధిక రక్తపోటు, మధుమేహం, మూత్రనాళ ఇన్ఫెక్షన్, ప్రసవానికి ఎన్నో రోజులు ముందుగానే ఉమ్మనీరు కోల్పోవటం వంటి కారణాల వల్ల ముందస్తు ప్రసవంతో నెలలు తక్కువై బరువు తక్కువ పిల్లలు పుడుతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇలా ముందే పుట్టే పిల్లల్లో చాలా మంది పూర్తి అవయవాలు లేకుండా, ఊపిరితిత్తులు, గుండె, మెదడు, నాడీ, జీర్ణ వ్యవస్థలు పూర్తిగా ఎదగని స్థితిలో తల్లి గర్భం నుంచి బయటకు వచ్చేస్తున్నారు. వీరికి వెంటిలేటర్ సహాయంతో కృత్రిమ శ్వాసను అందిస్తూ ఐవీ సహాయంతో పోషకాలు అందించాలి. అలాగే నాడీ వ్యవస్థ మెరుగుపడేందుకు ఇంక్యుబేటర్ సహాయంతో వైద్యం అందించాలి. ప్రభుత్వపరంగా నెల్లూరులోని జీజీహెచ్‌లో 40 పడకలతో ఎస్ఎన్‌సీయూ (స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్) ఉంది. అయితే ఇక్కడ లెవల్ 1 చికిత్సలు మాత్రమే అందుతున్నాయి. ప్రతి రోజు ఇక్కడ 40 మందికిపైగా నెలలు తక్కువ పిల్లలు చికిత్సలు పొందుతుంటారు. ఈ విభాగంలో నియోనేటల్ కేర్ యూనిట్ ఏర్పాటు చేస్తే నిరుపేదల పిల్లలకు మరింత మెరుగైన వైద్య చికిత్సలు అందించి ప్రాణాలు నిలిపే అవకాశం ఉంటుందని వైద్యులు అంటున్నారు.

ఎస్ఎన్‌సీయూలో చికిత్సలు



ప్రభుత్వ ఆసుపత్రిలో ఎస్ఎన్‌సీయూ ద్వారా బరువు తక్కువ పిల్లలకు వైద్య చికిత్సలు అందిస్తున్నాము. లెవల్ 3 నియోనేటల్ కేర్ యూనిట్ వస్తే మరిన్ని వైద్య చికిత్సలు అందించే వీలుంటుంది. గర్భవతులు క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదిస్తే నెలల తక్కువ బరువు ఉండే పిల్లల జననాలను తగ్గించవచ్చు.

- డాక్టర్ జయచంద్ర నాయుడు, చిన్న పిల్లల వైద్య నిపుణులు, జీజీహెచ్

ఎన్నో రకాల వైద్య చికిత్సలు

తక్కువ బరువుతో పుట్టిన పిల్లలకు జిల్లా వ్యాప్తంగా ఎన్నో ఆసుపత్రులు లెవల్ 3 వైద్య చికిత్సలు అందిస్తున్నాయి. 30కిపైగా ఆసుపత్రుల్లో నియోనేట ల్ కేర్ యూనిట్ సేవలు అందుతున్నాయి. అయితే క్రిటికల్ కేసుల్లో మాత్రం పిల్లలను బతికించలేక ఆసుపత్రులు చేతులెత్తేస్తున్నాయి. ప్రతి ఏటా జిల్లాలో ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సుమారు 10 వేల ప్రసవాలు జరుగుతున్నాయి. ఆయా ఆసుపత్రులకు వచ్చే వారంతా నిరుపేదలే. వీరిలో అత్యుత్తమ వైద్యం అవసరమైన ప్రీమెచ్యూర్ పిల్లలను తిరుపతి రుయా ఆసుపత్రికి తరలిస్తు న్నారు. కాగా, పుట్టినప్పుడు రెండు కిలోల కంటే తక్కువ బరువు ఉండే పిల్లలకు కంగారూ మదర్ కేర్ చికిత్సలు అవసరమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. తల్లీబిడ్డ శరీరాలు ఒకదానికొకటి తగిలేలా తల్లి స్పర్శతో బిడ్డలో వేడిని పుట్టించేలా చర్యలు తీసుకుంటే బిడ్డ ఎదుగుదల మెరుగ్గా ఉంటుందంటున్నారు.

మహిళలకు నైపుణ్యాభివృద్ధి అవసరం

● సహకార వారోత్సవాల్లో డీసీవో

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల మహిళలకు నైపుణ్యాభివృద్ధి అవసరమని డీసీవో గురప్ప తెలిపారు. సహకార వారోత్సవాలలో భాగంగా శనివారం డీసీవో కార్యాలయంలో పొదుపు మహిళలతో నిర్వహించిన సమావేశంలో వారితో సహకార ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని పొదుపు సంఘాలు ప్రపంచ వ్యాప్తంగా ప్రాధాన్య తను పొందాయని చెప్పారు. నేటి పోటీ మార్కెట్‌కు అనుగుణంగా వారికి వ్యాపార దక్షిత, నైపుణ్యాభి వృద్ధిని పెంపొందించి వారు తయారు చేసిన ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్ సౌకర్యాలను కలగచేస్తామన్నారు.



పొదుపు మహిళలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీసీవో గురప్ప

బాలల సంరక్షణకు పటిష్ట చర్యలు : ఐసీడీఎస్ పీడీ

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాలల సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్ చెప్పారు. శనివారం ఆమె తన చాంబర్‌లో సఖి, ఓఎస్సీ సిబ్బందితో సమీక్షించారు. బాలసదన్ బాలలు, శిశు సంరక్షణ కేంద్రాల్లో శిశువులు, తప్పిపోయి సంరక్షణ కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న చిన్నారులు, మహిళలకు సంబందించిన సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. తప్పిపోయిన బాలలను వారి తల్లిదండ్రుల చెంతకు చేరుస్తున్నామని చెప్పారు. బాల్య వివాహాల నిరోధక చట్టం, మహిళా సాధికారిత, బాలల అభివృద్ధిపై జిల్లా వ్యాప్తంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

కాగా, జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని వాత్సల్య అనాథ శరణాలయంలో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ క్యాంపు నిర్వహించి పిల్లలకు ఆధార్ కార్డులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షణ అధికారి సురేష్, తదితరులు పాల్గొన్నారు.



బాలల సంరక్షణపై సమీక్షిస్తున్న పీడీ హేనా సుజన్

రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● రౌండ్‌టేబుల్ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు

నెల్లూరు(వైద్యం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని పలు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శనివారం కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రైతు సంఘాల నేత చంద్ర రాజగోపాల్ అధ్యక్షతన డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు వెంకమరాజు మాట్లాడుతూ డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ కమీషన్ సిఫార్సులు మేరకు పంటల ఉత్పత్తికి 50 శాతం కలిపి మద్దతు ధర కల్పించాలన్నారు. జిల్లా కార్యదర్శి పుల్లయ్య మాట్లాడుతూ రైతులకు ఒక పర్యాయం పంట రుణాలను మాఫీ చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మూలం వెంకయ్య మాట్లాడుతూ రైతుల ఆత్మహత్యల నివారణకు కేరళ రాష్ట్రం వలే రైతు రుణ ఉపశమన చట్టంను పార్లమెంట్‌లో ఆమోదించి అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం తెచ్చి నెలకు రూ.10వేల పింఛను సౌకర్యం వర్తింప చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గురునాథం మాట్లాడుతూ కౌలు రైతు చట్టంలో భూ యజమాని సంతకం ఉండాలన్న నిబంధనలు తొలగించి రుణ సదుపాయం కల్పించాలన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ చేతివృత్తిదారుల సంఘం నేతలు గుంజి దయాకర్, కటికాల వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రామరాజు, షాన్వాజ్, అంజనేయులు, నాగేశ్వరరావు, సునీత, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నేతలు

'లింగ నిర్ధారణ'కు కఠిన చర్యలు

● స్కానింగ్ సెంటర్లు నిబంధనలు అతిక్రమించొద్దు ● డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

నెల్లూరు(వైద్యం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు నిబంధనలు అతిక్రమించి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య హెచ్చరించారు. శనివారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో జరిగిన జిల్లాస్థాయి సలహా సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ సర్వే నిష్పత్తి ప్రకారం 1000 మంది మగ పిల్లలు జన్మిస్తే 1011 మంది బాలికలు జన్మిస్తున్నట్లు నిర్ధారణ అయిందని, అందులో జిల్లా 4వ స్థానంలో ఉందన్నారు. ఈ క్రమంలో లింగనిర్ధారణ జరగకుండా స్కానింగ్ కేంద్రాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించేందుకు 10 మంది జిల్లా ప్రోగ్రాం అధికారులను నియమించినట్లు తెలిపారు. స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు నిబంధనలకు లోబడి అల్ట్రాసౌండ్, సిటీస్కాన్, ఎమ్మారై, ఎకో, బి స్కాన్‌కు ముందుగానే పీసీపీఎన్‌డీటీ కింద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అలా చేసుకోని పక్షంలో తీవ్రమైన చర్యలు ఉంటాయన్నారు. సదరు వైద్య పరికరాలు, వాటిని ఉపయోగించే వైద్యుల వివరాలు జిల్లా అథారిటీ విడుదల చేసిన నిబంధనలకు అనుగుణంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో ఫామ్ ఎఫ్ తప్పనిసరిగా నమోదు చెయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుల్తానా, డాక్టర్ కిరణ్, డాక్టర్ మయూరి, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, డివిజనల్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ దయాకర్, డెమో కనకరత్నం, ఎన్‌జీవోలు కవితారెడ్డి, శ్రీనివాసరావు, కుసుమకుమారి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పెంచలయ్య

న్యూస్ బాక్స్

సమస్యలు పరిష్కరించండి

కలిగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను విజయవాడలోని ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యుత్ సిబ్బంది కొరత ఉందన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

కావలి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలుగోళమ్మపేట అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం అయ్యప్ప స్వామి జన్మదిన పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి చక్రస్నాం, పడిపూజ, విశేష పూజలు నిర్వహించారు. చక్రస్నానం పూజలకు ఎన్‌శ్రీనివాసులురెడ్డి దంపతులు, గుర్రం వెంకటేశ్వర్లు దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పడిపూజకు ఉభయకర్తలుగా మారంరెడ్డి శివన్నారాయణ దంపతులు మాధవరెడ్డి దంపతులు వ్యవహరించారు. ఆలయ కోశాధికారి అమరావేదగిరి ధర్మకర్తలు మాధవి, నవీన్, సభ్యులు, గురుస్వాములు పాల్గొన్నారు.

ఎన్‌కేబీసీలో సమస్యలు పరిష్కరించండి

కొండాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చింతలదీవి పంచాయతీ పరిధిలోని జాతీయ కామధేను పునరుత్పత్తి కేంద్రంలోని సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పశుసంవర్థక శాఖ డైరెక్టర్‌ను మండల బీజేపీ అధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జున కోరారు. విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో శనివారం దామోదరనాయుడును బీజేపీ రాష్ట్ర యువ మోర్చ ఉపాధ్యక్షుడు ఓరుగంటి మాధవరావు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలసి వినతిపత్రం అందజేశారు. ఎన్‌కేబీసీలోని సమస్యలను పరిష్కరించాలని కోరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సర్వే వేగవంతం చేయాలి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇంటింటా సర్వే, ఎన్‌పీసీఐ ఆధార్ లింకు కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఈవోపీఆర్డీ మల్లికార్జున సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించి సర్వేను వేగవంతం చేయాలన్నారు.

ఎంబుక్ మాయంపై కేసు

సంగం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వంగల్లు పంచాయతీకి చెందిన ఎంబుక్ మాయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదయింది. వివరాల మేరకు.. వారం రోజుల కిందట బీరువా తాళాలు పగులగొట్టి అందులోని ఎంబుక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు తీసుకెళ్లారు. దీంతో పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కారం

సంగం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వెంకయ్యస్వామి ఆలయం వీధిలో లోఓల్టేజ్ సమస్య పరిష్కారానికి శనివారం 100 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేశారు. కాలనీలో లోఓల్టేజ్ సమస్యను ఇటీవల ఏఈగా బాధ్యతలు చేపట్టిన మన్మధరావు దృష్టికి స్థానికులు తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన వెంటనే 100 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అలరించిన కవి సమ్మేళనం

సంగం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. తెలుగు పండింట్లను సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు పండిట్ సబ్బు ప్రవీణ్, లైబ్రేరియన్ రవీంద్రరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు అనిల్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

కావలి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో చెత్తాచెదారాలు పేరుకుపోయి దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని పారిశుధ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యులు సాయిప్రసాద్ శనివారం ఆర్డీవో వంశీకృష్ణను కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

కావలి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహంచనున్నట్లు ఎమ్పీడీవో శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పారిశుధ్యం, సీజనల్ వ్యాధుల నిర్మూలన, ఉపాధిహామీ పనులు, తాగునీటి సరఫరా, నీటిపారుదల తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలి పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, ఎమ్పీ టీసీలు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.

చెత్త సంపద కేంద్రాలు పిల్లర్లకే పరిమితం

లింగసముద్రం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను చెత్తరహితంగా, పరిశుభ్రంగా తయారు చేసేందుకు తడి,పొడి చెత్తను సేకరించి దాన్ని వర్మీకపోస్టు ఎరువుగా తయారు చేసి రైతులకు అందించేందుకు 2014-19లోని తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేసిన చెత్త సందప కేంద్రాలు మండలంలో నిరుపయోగంగా ఉన్నాయి. 2017లో లింగసముద్రం పంచాయతీ జంపాలవారిపాలెంలో సుమారు రూ.3.50లక్షల వ్యయంతో చెత్త సంపద కేంద్రాన్ని నిర్మాణం ప్రారంభించారు. కేంద్రం ఏర్పాటుకు పిల్లర్లు లేపి వాటిపైనే తాటిఆకులు, బొంగులతో నిర్మాణం చేపట్టారు. సుమారు 20వర్మీకంపోస్టు పిట్లు నిర్మించారు. నిర్మాణం పూర్తయిన వెంటనే అధికారులు ఈ కేంద్రాన్ని గ్రామ పంచాయతీకి అప్పగించారు. అయితే అప్పట్లో ప్రభుత్వం రిక్షాలు మంజూరు చేసి చెత్తసేకరణలకు గ్రీన్ అంబాసిడర్లను నియమించారు. కేంద్రం వద్ద ఉన్న బొంగులు తరువాత గాలి వాన వచ్చి బొంగులు, తాటాకులు లేచి పోవడంతో అధికారులు పట్టించుకోలేదు. అప్పటి నుండి ఈ కేంద్రాన్ని పునర్నిర్మాణానికి నోచుకోవడం లేదు. మిగిలిన పంచాయతీలలో రేకులతో నిర్మించిన చెత్త సంపద కేంద్రాల నిర్వహణను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. అయితే 2023లో వైసీపీ ప్రభుత్వం చెత్త తరలింపు రిక్షాలను మంజూరు చేయగా, వాటిని అన్ని పంచాయతీలకు పంపిణీ చేశారు. వాటిని ఎక్కడా వినియోగించిన దాఖలాలు లేవు. పైగా ఈ రిక్షాలను మూలకు చేర్చారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి మాధవరావును వివరణ కోరగా, ఈ కేంద్రాన్ని పునర్నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు.


పంచాయతీ కార్యాలయంలో చెత్తను తరలించే రిక్షాలు


లింగసముద్రం చెత్త సంపద కేంద్రం కేంద్రం దుస్థితి

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ లైబ్రేరియన్ గోవిందరెడ్డి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో శనివారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయ ఉద్యమంలో పనిచేసిన మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి లైబ్రేరియన్ ఓ శ్రీనివాసరాజు, లైబ్రరీ రికార్డు అసిస్టెంట్ ఐ.తనూజ, పలువు రు పురప్రముఖులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అసెంబ్లీలో ఎమ్మెల్యేల గళం


కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, దగుమాటి క్రిష్ణారెడ్డి

జలదంకి, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంత నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శనివారం రాష్ట్ర అసెంబ్లీలో తమ గళం వినిపించారు. నియోజకవర్గంలోని 8మండలాల్లో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ సుజల పథకం కింద రూ.26కోట్లతో మంచినీటి పథకాలను నిర్మించామని, మరో రూ.5కోట్లు ఖర్చు చేస్తే అవి ప్రజలకు వినియోగంలోకి వచ్చేవన్నారు. కానీ గత వైసీపీ ప్రభుత్వం ఈ పథకానికి నిధులు ఇవ్వకుండా గాలికొదిలేసిందన్నారు. ప్రజల దాహార్తి తీర్చేలా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే ప్రశ్నోత్తరాల సమయంలో కోరారు.

కావలి సమస్యలపై..

కావలి, నవంబరు 16: నియోజకవర్గంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం, మైనర్ ఇరిగేషన్, తీరప్రాంతంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి అసెంబ్లీలో మాట్లాడారు.

- మద్దూరుపాడు ఏపీ టిడ్కో ఇళ్లకు తూర్పున ఇరిగేషన్ ట్యాంకు ఉన్నదని దాని ఎఫ్‌టీఐ లెవల్‌లోనే టిడ్కో ఇళ్ల బేస్‌మెంట్ వేసినట్లు తెలిపారు. చెరువు నిండితో గ్రౌండ్‌ఫ్లోర్ ఇళ్లు ముంపునకు గురౌతున్నట్లు వాపోయారు. నివారణకు ప్రహరీ నిర్మించి వర్షపునీరు వెళ్లేలా డ్రైనేజి ఏర్పాటు చేయాలన్నారు.
- జమ్మలపాలెంలో 113ఎకరాలు టిడ్కో ఇళ్లకు స్థలం సేకరించి లబ్ధిదారులకు బేస్‌మెంట్‌లు వేశారని వైసీపీ ప్రభుత్వం ఈ బేస్‌మెంట్‌లను తొలగించి నుడాకు అప్పగించడంతో వాటిని రూ.39కోట్లకు డెవలప్‌మెంట్ కాంట్రాక్ట్ ఇచ్చి లేఅవుట్ వేసి అమ్ముకున్నారన్నారు.
- నియోజకవర్గంలో చెరువులు కాలువలు అభివృద్ధి, మరమ్మతులకు నోచుకోవడం లేదన్నారు. నిధులు ఇచ్చి ఆదుకోవాలన్నారు. అలాగే 72కి.మీ తీరప్రాంతంలో 40వేల కుటుంబాల మత్స్యకారులు నివసిస్తున్నారని చెప్పారు. సముద్రపు గాలికి విద్యుత్ తీగలు తుప్పుపట్టి రాత్రి సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో తరచూ తెగి ఇళ్ల పడుతున్నట్లు తెలిపారు. విద్యుత్ తీగలు మార్చేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

కౌలు రైతులకు రుణాలు

- ఏవో శ్రీధర్‌రెడ్డి అనంతసాగరం



అనంతసాగరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):మండలంలో కౌలు రైతులకు మొదటి పంట సాగుకు అవసర మైన పంట రుణాలకు వ్యవసాయశాఖ ద్వారా సహకారం అందిస్తున్నామని మండల అగ్రికల్చర్ అధికారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

? మొదటిపంటగా ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.

! అన్ని గ్రామాల్లో ఈసీజన్‌లో 11వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతుంది. 5వేల ఎకరాల్లో నార్లు పోశారు.

?ఎరువుల కొరత ఉందా.

! అవసరమైన ఎరువులు రైతు సేవాకేంద్రాలతో అందిస్తున్నాం. కావల్సిన వారు వీఏఏలను సంప్రదించాలి. కొరత లేకుండా ప్రత్యేక దృష్టి సారించాం.

? అనధికార దుకాణాలపై చర్యలు తీసుకుంటున్నారా.

! అన్ని పురుగుమందుల దుకాణాలు తనిఖీ చేస్తున్నాం. అనదికారికమంటూ లేవు. కొనుగోలు చేసే సంచులపై బిల్లు ఇవ్వాలి. లేకుంటే చర్యలు తీసుకుంటాం. రైతులు ఫిర్యాదు చేయాలి.

? వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇస్తున్నారా.

! తుపాన్ ప్రభావంతో కొన్ని గ్రామాల్లో వరి దెబ్బతిన్నట్లు తొలుత ప్రాథమికంగా గుర్తిచాం. అనంతరం పొలాల్లో నీరు నిల్వ చేరకుండా రైతులకు జాగ్రత్తలు తెలియజేశాం. ఎలాంటి నష్టం జరుగలేదు.

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై శిక్షణ

ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీ శక్తి భవనంలో శనివారం ఈనెల 23న జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల నోడల్ అధికా రులు చంద్రమౌళి, వేణు మాట్లాడుతూ 19నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయన్నారు. శిక్షణ ఇవ్వాల్సిన మాస్టర్‌ట్రైనర్, జలవనరుల శాఖ డీఈ సాయి శంకర్‌నారాయణ రాకపోవడంతో నోడల్ అధికారు లే శిక్షణ ఇచ్చారు. ఆయన గైర్హాజరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు కార్యక్రమంలో శ్రీనివాసులు, జహీర్‌ఖాన్ పాల్గొన్నారు.

- దుత్తలూరు (ఉదయగిరి రూరల్): స్థానిక మండల కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికల సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్, ఇరిగేషన్ డీఈ గురుమూర్తి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.
- లింగసముద్రం: సాగునీటి సంఘాల ఎన్నికల అధికారులు, పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు మాస్టర్ ట్రైనర్, రాళ్లపాడు ప్రాజెక్టు డీఈ ఎం.వెంకటేశ్వర్లు, నోడల్ అధికారి, ప్రాజెక్టు ఏఈ చంద్రమౌళిలు శిక్షణ ఇచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డీఈ వెంకటేశ్వర్లు పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌తో చూపించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సంగం: పాల్గొన్న తహసీల్దారు సోమ్లా నాయక్

- జలదంకి: స్థానిక పద్మావతి కల్యాణ మండపంలో సాగునీటి సంఘాల ఎన్నికల అధికారులకు శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ ప్రమీల ఆధ్వర్యంలో శిక్షణలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.
- సంగం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీవో, ఏపీవోలకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు సోమ్లానాయక్ పాల్గొని మాట్లాడారు కొరిమెర్ల, చెన్నవరపాడు, మర్రిపాడు, సంగం మైనర్ సాగునీటి సంఘాలు, పడమటిపాళెం, అన్నారెడ్డిపాలెం రెండు మేజర్ సాగునీటి సంఘాలు ఉన్నాయన్నారు. ఈనెల 21న ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ వినయ్ కుమార్, ఏవో శ్రీహరి పాల్గొన్నారు.


ఉదయగిరి రూరల్: శిక్షణ ఇస్తున్న నోడల్ అధికారి చంద్రమౌళి

- కొండాపురం: సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై అధికారులు, సిబ్బందికి మండల కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. శిక్షణలో కలువాయి మండల ఇరిగేషన్ డీఈ ఆర్‌కె.రెడ్డి పాల్గొన్నారు. 19చెరువులతో పాటు, రాళ్లపాడు, మోపాడు రిజర్వాయరులకు సాగునీటి సంఘాల ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారయ ణరావు, తహసీల్దార్ కోటేశ్వరరావు, ఇరిగేషన్ ఏఈ రమేష్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ అధికారులు, వీఆర్‌వోల ఉన్నారు.
- వింజమూరు: మండల కార్యాలయ ప్రాంగణంలో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణపై ఎన్నికల అధికారులకు, పోలింగ్ అధికారులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఇరిగేషన్ డీఈ రమణారావు శిక్షణ ఇచ్చారు.

సమస్యలపై ఎమ్మెల్యే స్పందన హర్షణీయం

ఉదయగిరి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గ సమస్యలను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అసెంబ్లీలో వివరించడం అభినందనీయమని మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని పూర్తిచేసి ఫ్లోరైడ్ పీడిత ప్రాంత వాసులకు శుద్ధిజలం అందించాలని, పొన్నెబోయిన చెంచురామయ్య జలాశయాన్ని అభివృద్ధి చేయాలని, సోమశిల హైలెవల్ కెనాల్ పూర్తిచేయాలని, కోల్డ్‌స్టోరేజీలు నిర్మించాలని, సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు ఏర్పాటు చేయాలని, ఉదయగిరి-నందవరం రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే కోరడం సంతోషకరమన్నారు. గతంలో ఏ ఎమ్మెల్యేలు సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పిన దాఖలాల్లేవని పేర్కొన్నారు.

మాలకొండ ఆదాయం రూ.11.34లక్షలు

వలేటివారిపాలెం. నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామికి శనివారం భక్తుల నుండి రూ. 11.34 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా అళహరి సుధాకర్ జన్మదినం

కావలి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక జనసేన నియోజకవర్గ కార్యాలయంలో శనివారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కేక్‌కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. అనంతరం పాతూరు శివాలయంలో సుధాకర్ పేరుతో పూజలు నిర్వహించి తాళ్లపాలెం అనాథా శ్రమంలో నిత్యావర సరుకులు పంపిణీ చేసి పిల్లలకు కేక్‌లు, మిఠాయిలు, భోజన ప్యాకెట్లు పంచిపెట్టారు. మధ్యాహ్నం పార్టీ కార్యాలయంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో పసుపులేటి బాబు, అగస్టీన్, తిరుమలశెట్టి, వెంక టేష్, వెంకట్ యాదవ్, వీర మహిళలు కొప్పుల లక్ష్మీ, హేలన, సాహితి, మాధురి, ప్రసన్న పాల్గొన్నారు.



కావలి: కేక్‌కట్ చేస్తున్న జనసేన శ్రేణులు

- **రోగులకు పండ్లు పంపిణీ**

అల్లూరు: అళహరి సుధాకర్ జన్మదినం సందర్భంగా స్థానిక ప్రభుత్వానుపత్రిలో శనివారం జనసేన నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కారుమంచి కార్తీక్ శర్మ, రాఘవయ్య, బుర్రి మల్లికార్జున, నాగేశ్వరరావు చేపూరు స్రుబమణ్యం, కత్తి విజయ్, కేశవాచారి పాల్గొన్నారు.

ప్రణాళికలతోనే గ్రామాల అభివృద్ధి

ఏఎస్ పేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతో గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీవో ప్రసన్నకుమారి తెలిపారు. శనివారం ఆమె స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని గ్రామ పంచాయతీ విధులు, బాధ్యతలు గురించి వివరించారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక పాత్ర అన్నారు. ఈ కార్యక్రమంలో టిఓటిలు దామోదర్, షేక్ సయ్యద్ బాబా, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసిలు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు శ్రీకొలను విద్యార్థులు ఎంపిక

ఏఎస్ పేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన అండర్-17 రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు శ్రీకొలను జడ్పీహైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని హైస్కూల్ హెచ్‌ఎం నిరంజన్ తెలిపారు. శనివారం విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు థామస్ పీటర్‌ను అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చెర్మన్ మాధవరెడ్డి, విద్యార్థినుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండబిట్రగుంటలో అన్నదాత సుఖీభవ

బిట్రగుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక పాఠశాలలో మద్దులూరి ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో శనివారం అన్నదాత సుఖీభవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారులు నరసింహారావు, జయమ్మ హాజరై పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ మెంబరు మాలకొండారెడ్డి, అల్లూరు ఎంఈవోలు సుమతి, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

బిట్రగుంట రైల్వే అభివృద్ధికి కృషి చేయాలి

బిట్రగుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రులు కృషి చేయాలని రైల్వేప్రాంత అభివృద్ధి అసోసియేషన్ సభ్యులు చల్లా నరహరి కోరారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేటలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విజయవాడ సౌత్‌సెంట్రల్ రైల్వేలో ఎక్కడ లేనంత విశాల రైల్వే భూములు బిట్రగుంట ప్రాంతంలోనే ఉన్నాయన్నారు. కోట్లాది రూపాయల విలువ చేసే రైల్వే ఆస్తులను సద్వినియోగం చేసుకుంటే రైల్వేశాఖకు ఖర్చు తగ్గడంతో పాటు స్థానిక నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

ఉదయగిరి రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గన్నేపల్లి పంచాయతీ మిట్టపల్లిలో శనివారం సీతా రాముల కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు పరిసర గ్రామాల ప్రజలు తరలివచ్చి కనులారా తిలకించారు. భక్తులకు నిర్వాహ కులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. రాత్రి స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించారు.



- సంగం (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం అర్ధరాత్రి జ్వాలా తోరణం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీకామాక్షిదేవి, సంగమేశ్వరస్వామి గ్రామోత్సవం నిర్వహించారు.

రికార్డులు సరిలేని ఎరువుల తాత్కాలిక సీజ్

- కందుకూరులో

రెండోరోజూ కొనసాగిన తనిఖీలు

కందుకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎరువుల, విత్తన విక్రయ దుకాణాలపై వ్యవసాయశాఖ విజిలెన్స్ అధికారుల తనిఖీలు శనివారం కూడా కొనసాగాయి. కావలి ఏడీఏ సీహెచ్ నాగరాజు ఆధ్వర్యంలో కందుకూరు ఏఓ రాము, ఇతర అధికారులు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాధారమణ ఫర్టిలైజర్స్‌లో స్టాకు రిజిష్టర్, ఈ పాస్ మిషన్‌లోని నిల్వలు సరిపోలేదని గుర్తించి 5.95 మెట్రిక్ టన్నుల యూరియా, 8.7 మెట్రిక్ టన్నుల 20-20-0-13 ఎరువులను, 60 కిలోల 13-0-45, 60 కిలోల 19-19-19 రకం ఎరువుల అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేస్తూ సీజ్ చేసినట్లు ఏఓ రాము తెలిపారు.


స్టాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఈ సందర్భంగా కావలి ఏడీఏ నాగరాజు మాట్లాడుతూ ప్రైవేటు ఎరువుల డీలర్లు ఎంఆర్పీలకు ఎరువులు విక్రయించాలని, విధిగా రసీదు ఇవ్వాలని, బిల్లు పుస్తకంపై సంతకాలు తీసుకోవాలన్నారు. రైతుల బయోమెట్రిక్ ఆధారంగా ఎరువులు పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. రైతులు కూడా విధిగా రసీదు అడిగి తీసుకోవాలని, సమస్యను మండల వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేయాలని సూచించారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

కందుకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం కామేపల్లిలో మహిళా కండక్టర్‌పై దాడి చేసిన పత్తిపాటి హరిబాబును కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ డిమాండ్ చేశారు. కందుకూరు ఏరియా హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న కండక్టర్ సీహెచ్ సుభాషిణిని సీపీఐ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న మహిళా కండక్టర్‌పై దాడికి పాల్పడటం విచారకరం అన్నారు. నిందితుడిపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్.వెంకటరావు, ఎస్డీ యాసిన్, మాలకొండయ్య, సురేష్‌బాబు, బాలకోటయ్య, ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు ఆదినారాయణ, డీవై కొండలు, బాబూరావు, మహేష్, ఎంఎస్ఎస్ రాజు, రామారావు ఉన్నారు.


కండక్టర్‌ను పరామర్శిస్తున్న సీపీఐ నాయకులు

విద్యార్థులకు వైద్య పరీక్షలు

సంగం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల గురుకుల కళాశాలలో వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాష్ట్రీయ బాల ఆరోగ్య స్వస్థ్య కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బాలబాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వెంటనే చికిత్సలు అందించి మేజర్ ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి తదుపరి చికిత్సల కోసం స్పెషలైజ్డ్ వైద్యశాలలకు పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రెండవ వైద్యాధికారి అశోక్, ఎంఈవో జానకిరామ్, ప్రిన్సిపాల్ సుమతి పాల్గొన్నారు.


విద్యార్థినితో వివరాలు తెలుసుకుంటున్న వైద్యులు

రాళ్లపాడు సమస్యల పరిష్కారానికి 18న ధర్నా

కందుకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఎం ఏరియా కార్యదర్శులు వెంకటేశ్వర్లు, జీవీబీ కుమార్, రాళ్లపాడు పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాకుమాని మాధవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల ప్రాజెక్టు నుంచి రాళ్లపాడుకు 1.5 టీఎంసీల నీటిని విడుదల చేయాలని, ఉత్తర కాలువను వెడెల్పు చేయాలని, రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువను పొడిగించాలని, చేపల మాఫియాను అరికట్టాలని, కలుషిత నీటిని శుభ్రం చేయాలని, ప్రాజెక్టు నిర్వహణను మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీలకతీతంగా రైతుసంఘాలు, వివిధ ప్రజాసంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

అల్లూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో శనివారం జనసేన నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కారుమంచి కార్తీక్ శర్మ, రాఘవయ్య, మల్లికార్జున, నాగేశ్వరరావు చేపూరు స్రుబమణ్యం, విజయ్, కేశవాచారి పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

వలేటివారిపాలెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగుమందు దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని కావలి వ్యవసాయ సహాయ సంచాలకులు సీహెచ్ నాగరాజు తెలిపారు. శనివారం ఆయన బడేవారిపాలెం, పోకూరు, వలేటివారిపాలెంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలు, బడేవారిపాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలోని ఎరువులను ఏఓ హేమంత్‌భరత్‌కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. ప్రయివేట్ డీలర్లు దుకాణాల ముందు డీలర్, షాపు పేరు, లైసెన్స్ నెంబరు అడ్రస్ బోర్డు పెట్టాలని, ఎంఆర్‌పి రేట్లకే విక్రయించి రశీదులు ఇవ్వాలని తెలిపారు.

'బెస్ట్ వాకర్స్' సభ్యుల ఔదార్యం


కావలి టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు డయాలిసిస్ పేషెంట్ రాధాకృష్ణకు శనివారం రూ.10వేలను వన్ టౌన్ ఎస్ఐ జమాల్‌బాషతో అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు శేషయ్య, సభ్యులు రమేష్, వెంకటేశ్వర్లు, భాస్కర్ నాయుడు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన

సీతారామపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో కురుస్తున్న వర్షాల కారణంగా గంగవరంలో నేల వాలిన వరి పంటను శనివారం మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి పరిశీలించారు. రైతులకు త్వరగా నష్టపరిహారం అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో వీఏఏ లక్ష్మీనారాయణరైతులు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన

వింజమూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ జ్యోతి కొండయ్య, విద్యార్థులు తదితరులు వివరించారు.



న్యూస్ బాక్స్

నేడు మహాకుంభాభిషేకం

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలాపేట గణేష్ ఘాట్ వద్ద పునః నిర్మించిన స్వర్ణ లింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం మహాకుంభాభిషేకం జరుగుతుందని బీజేపీ నేత పీ.సురేంద్రరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆలయాన్ని స్వర్ణ భారత్ ట్రస్ట్ ఎండీ దీపావెంకట్ దంపతులు పునర్నిర్మించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దక్షిణామయి శారదాపీఠం, ఉత్తర పీఠాధిపతులు విధు శేఖర భారతీస్వామి, తుని తపోవనం పీఠాధిపతులు సచ్చిదానంద సరస్వతీలు విచ్చేసి వారి స్వహస్తాలతో మహా సంప్రోక్షణలు చేస్తారని, భక్తులు తరలిరావాలని కోరారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలాపేట గురు నిలయంలో శనివారం గొలగమూడి వెంకయ్య స్వామి శిష్యుడు వెంకట్రావు కుటుంబ సభ్యులు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకయ్యస్వామి పూజలు జరిగాయి. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మాకాని గోపి, హైకోర్టు న్యాయవాది చంద్రబాబు, ప్రముఖ పారిశ్రామిక వేత్త పెంచలయ్య పాల్గొన్నారు.

క్షయ రోగులకు మెరుగైన వైద్యం

నెల్లూరు(వైద్యం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్షయ వ్యాధి నివారణకు చర్యలు చేపట్టాలని అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. శనివారం నెల్లూరు నగరంలోని డేమియన్ ఫౌండేషన్ సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్థులకు అవసరమైన వైద్య పరీక్షలు చేయాలన్నారు. క్షయ వ్యాధి నివారణకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు.

ఇస్కాన్‌లో తులసీ కల్యాణం

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇస్కాన్ మందిరంలో శనివారం రాత్రి తులసీ దామోదర కల్యాణం వైభవంగా జరిగింది. ఇస్కాన్ చైర్మన్ సుఖదేవస్వామి ఆధ్వర్యంలో తులసీ హారతి, సంధ్యా హారతి, కార్తీక దీపం అలంకరణ, దామోదర కల్యాణం జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అన్నప్రసాద వితరణ జరిగింది.

జనవాణిని వినియోగించుకోండి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న జనవణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ పార్టీ నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ కోరారు. గోమతి నగర్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం జనవాణి కార్యక్రమం నిర్వహించి అర్జీలు స్వీకరించారు. నాయకులు వై.రవి, పవన్, జమీర్ పాల్గొన్నారు.

మూలస్థానేశ్వరుడికి కోటంరెడ్డి దంపతుల పూజలు

మోక్షజ్ఞ మంచి నటుడిగా ఎదగాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణ కుమారుడు మోక్షజ్ఞ తాత, తండ్రులను మించిన నటుడు కావాలని ఆకాంక్షిస్తూ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నుడా చైర్మన్‌గా ఎన్నికైన కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి దంపతులు శనివారం నగరంలోని మూలస్థానేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయానికి సతీమణి సంధ్యతో కలిసి వెళ్లి అభిషేకాలు చేశారు. ఆయన మాట్లాడుతూ బాలకృష్ణ కుటుంబం సంతోషంగా ఉండాలని, నందమూరి వారసుడిగా సినీ రంగ ప్రవేశం చేస్తున్న మోక్షజ్ఞ అందరి ఆదరాభిమానాలు పొందాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.



పూజలు చేస్తున్న కోటంరెడ్డి దంపతులు

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్
- పాఠశాల సిబ్బందిపై మండిపాటు

కొడవలూరు నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): చంద్రశేఖరపురం గురుకుల పాఠశాలను ఎస్టీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు శంకర్ నాయక్ తనిఖీ చేశారు. పాశాలలోని తరగతి గదులు, మరుగుదొడ్లు, భోజనంను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొరవడిన మౌలిక వసతులపై సిబ్బందిపై మండిపడ్డాడు. తీరు మార్చుకోవాలని హెచ్చరిం చారు. అధికారులతో సమీక్ష నిర్వహిచి మౌలిక వసతులకల్పనపై చర్చించారు. ఆయన వెంట స్ఫూర్తిరెడ్డి, సుబ్బారావు, నాయకులు మూంగ రెడ్డి, కేతూ వెంకటరమణారెడ్డి, జోస్న శివకుమార్, మదన్, పెంచలయ్య, బండి కిరణ్ ఉన్నారు.



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న శంకర్ నాయక్

ఉద్యోగమేళాకు అనూహ్య స్పందన

నెల్లూరు(విద్య), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని డీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన ఉద్యోగమేళాకు అనూహ్య స్పందన లభించింది. చెన్నై, శ్రీసిటీకి చెందిన పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. 128 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏవీ.రమణరావు తెలిపారు. ఎంపికైన వారిని కళాశాల సిబ్బంది అభినందించారు. అలాగే ఈనెల 18వ తేదీన మరోసారి ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డీ.గిరి తెలిపారు. పూర్తి వివరాలకు 8143227239, 8639867407లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ వై.వెంకటేశ్వర్లు, మెంటర్ ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

డీకేడబ్ల్యూ కళాశాలలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమణరావు, డాక్టర్ శేషయ్య, డాక్టర్ సీహెచ్.నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నెల్లూరు చాప్టర్ ఆధ్వర్యంలో..

సొసైటీ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ ఇన్ఫర్మేషన్ సైన్స్(శాలిస్) నెల్లూరు చాప్టర్ ఆధ్వర్యంలో నగరంలోని సుంకు చెంగన్న పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్‌తో తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో విడవలూరు డిగ్రీ కళాశాల అధ్యాపకుడు రమణారావు, చాప్టర్ చైర్మన్ డాక్టర్ కిరణ్ కుమార్, కార్యదర్శి డాక్టర్ విజయమహేష్, హెచ్‌ఎం అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్యానికి పత్రికలే మూలాధారం

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమాజంలో చైతన్యం కలిగించి ప్రజల సమస్యలు పరిష్కరించేది పత్రికలేనని సమాచార శాఖ డీడీ సదారావు అన్నారు. జాతీయ పత్రిక దినోత్సవం సందర్భంగా శనివారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నెల్లూరు కొండాయపాలెంలోని నగర పాలక ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మీడియా రంగంలో పలుమార్పులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి ఎ.జయప్రకాష్, టి.రమేష్‌బాబు, గడ్డం హనోక్, ప్రధానోపాధ్యాయుడు యం.భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు హరీష్, సోమేశ్వరరావు, కిరణ్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకుల కోసం వేలిముద్ర వేయాల్సిందే..

- సివిల్‌సప్లైస్ డీఎం లక్ష్మీనారాయణ

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ డీలర్లు రేషన్ సరుకులు తీసుకోవాలన్నా.. ఆ సరుకులను ఎండీయూ వాహనాల ద్వారా ఇళ్ల దగ్గర లబ్ధిదారులు పొందాలన్నా.. వేలిముద్ర వేయాల్సిందే. అప్పుడే ఈ కార్యక్రమం పారదర్శకంగా సాగుతోంది. అసలు ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద డీలర్లు ఎలా సరకులు పొందాలి అనే విషయమై సివిల్ సప్లైస్ డీఎం లక్ష్మీనారాయణ వివరించారు.



ఈ వారం ముఖాముఖి

? డీలర్లు రేషన్ సరుకులు ఎలా తీసుకోవాలి.

! ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద సరకు డెలివరీ తీసుకునేటప్పుడు రేషన్ డీలర్లు తప్పనిసరిగా ఈపాస్ యంత్రంలో వేలిముద్ర వేయాలి. అదేవిధంగా సరకులు రేషన్ షాపు వద్ద దింపుకున్న తరువాత కూడా వేలిముద్ర వేయాలి. అప్పుడే వారికి సరకులు చేరినట్లు నిర్ధారణ అవుతోంది. గతంలో వేలిముద్ర లేకుండా సరకులు తీసుకుని వెళ్లే అవకాశం ఉండేది. ఇపుడు ఆ పరిస్థితి లేదు.

? జిల్లాకు ఎన్ని టన్నుల బియ్యం, కందిపప్పు, చక్కెర కేటాయిస్తారు.

! జిల్లాకు ప్రతి నెలా 10,417 టన్నుల బియ్యం, 700 టన్నుల కందిపప్పు, 340 టన్నుల పంచదార కేటాయిస్తున్నారు.

? డీలర్ ఎప్పుడు సరుకులకు డబ్బు చెల్లించాలి.

! సరకు జిల్లాకు అలాట్ అయిన తరువాత ఆ సరుకులు పొందడానికి డీలర్లు కందిపప్పు, చక్కెర కోసం ఆన్‌లైన్‌లో నగదు చెల్లింపులు చెల్లించాలి.

? జిల్లాకు సరుకు అలాట్ మెంటు ఎప్పుడు జరుగుతోంది.

! ప్రతినెలా 15 నుంచి 20వ తేదీల మధ్య రేషన్ సరకుల అలాట్‌మెంటు వస్తోంది. అలాట్ మెంటు తరువాత సరకులు వస్తాయి. వచ్చిన వెంటనే రేషన్ డీలర్లు సరుకులు తీసుకుంటారు. ఆ పక్క నెల 1వ తేదీ నుం చి 17వ తేదీ లోపల కార్డుదారులకు సరుకులు అందచేస్తారు.

గ్రంథాలయ ఉద్యమకారులకు ఘన నివాళి

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక స్టోన్‌హౌస్‌పేట రేబాలవారి వీధిలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో శనివారం గ్రంథాలయం ఉద్యమ మహనీయులైన ఎస్సార్ రంగనాథన్, అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు, రచయిత పొట్లూరు శ్రీనివాసులు, ఎం.సతీష్‌కుమార్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని వారి చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. విద్యార్థులకు చిత్రలేఖన పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా నెల్లూరు నందిని, తదితరులు పాల్గొన్నారు.

- రంగనాయకుల పేట శాఖ గ్రంథాలయంలో 3రోజు పుస్తక ప్రదర్శనజరిగింది. విద్యార్థులకు చాక్లెట్స్ పంచిపెట్టినట్లు లైబ్రేరియన్ అరుణ తెలిపారు.



గ్రంథాలయ ఉద్యమ నేతలకు నివాళులర్పిస్తున్న ప్రముఖులు

ప్రపంచానికి చాటే విధంగా జైన్ దేవాలయ నిర్మాణం

వెంకటాచలం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భారతదేశ ప్రతిభా నైపుణ్యాలను ప్రపంచానికి చాటేవిధంగా జైన్ దేవాలయ నిర్మాణం ఉందని వీఎస్‌యూ టూరిజం విభాగాధిపతి డాక్టర్ పీ సుజాత అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న జైన్ దేవాలయాన్ని శనివారం ఆమె ఆధ్వర్యంలో యూనివర్సిటీలోని టూరిజం మేనేజిమెంట్ విభాగానికి చెందిన మొదటి సెమిస్టర్ విద్యార్థులు సందర్శించారు. ఆమె మాట్లాడుతూ జైన్ దేవాలయం ఎంతో ప్రాముఖ్యమైన సాంస్కృతిక, చారిత్రాత్మక ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో టూరిజం మేనేజిమెంట్ అధ్యాపకుడు ఎం విక్రమ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

- **ఆహార భద్రతపై అవగాహన**

విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఫుడ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఆహార భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్ బెంగళూరు నుండి ప్రొఫెసర్ డాక్టర్ సంగటి చెన్నకేశవరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వీఎస్‌యూ ఆహార సాంకేతిక విభాగాధిపతి డాక్టర్ ఎస్‌బీ సాయినాథ్, అధ్యాపకులు డాక్టర్ జే నాగరాజు, పర్వీన్‌బేగం, డాక్టర్ భావన తదితరులు పాల్గొన్నారు.

నారా రామ్మూర్తినాయుడి మృతి బాధాకరం

- టీడీపీ నేతలు వేమిరెడ్డి, సోమిరెడ్డి, బీద రవిచంద్ర నివాళి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు మృతి బాధాకరమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన అకాల మరణం, వారి కుటుంబానికి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పేర్కొన్నారు.

- నెల్లూరు(వైద్యం,ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోదరుడు నారా రామ్మూర్తినాయుడు మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మృతి తీరని లోటని, చంద్రగిరి ఎమ్మెల్యేగా ఎంతో అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. పారిశ్రామిక వేత్తగా కూడా రామ్మూర్తినాయుడు విశిష్ట సేవలు అందించారని పేర్కొన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని పేర్కొన్నారు.

నీటిసంఘాల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

మనుబోలు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలను ఎన్నికల సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ సిహెచ్ సుబ్బయ్య సూచించారు. స్థానిక సీఆర్ఆర్ కల్యాణ మండపంలో పీవోలు, ఏపీవోలకు శనివారం ఈనెల 23న నిర్వహించే నీటిసంఘాల ఎన్నికలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో నీటిపారుదల శాఖ డిఈ ప్రసన్న మాట్లాడుతూ ఈనెల 20న నోటిఫికేషన్ విడుదలవుతుందన్నారు. అందుకే ముందస్తుగా శిక్షణ ఇస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రంలో ఓటువేసే విధానం, అక్కడ నింపాల్సిన పత్రాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జలజాక్షి, ఎంఈవో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా అమలు చేయాలి

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌కు కల్లుగీత కార్మికుల వినతి



సమావేశం పాల్గొన్న డీసీ శ్రీనివాసరావు, సీఐ కిషోర్

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించే విధానం అమలు చేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావును కల్లుగీత కార్మికులు కోరారు. శనివారం ఆయన బుచ్చిలోని ఎక్సైజ్ స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం స్టేషన్‌లోని పలు రికార్డులు వారు పరిశీలించి తరువాత క్రైం రివ్యూ నిర్వహించారు. అనంతరం డీసీ, సీఐ కిషోర్‌తోకలిసి కల్లుగీత కార్మికులతో సమావేశం నిర్వహించారు. కార్మికుల సంక్షేమం కోసం వారికి ఉచితంగా మోకులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నెల్లూరు(క్రైం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని నవాబుపేట ఇన్‌స్పెక్టర్ షేక్ అన్వర్‌బాషా సూచించారు. నగరంలోని పప్పులవీధిలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలు, రోడ్ సేఫ్టీ, మత్తు మాదక ద్రవ్యాలు తదితర అంశాలపై శనివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించండి

- జడ్పీ సీఈవో మోహన్‌రావు

మనుబోలు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాబోయే 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామీణాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించా లని జడ్పీ సీఈవో మోహన్‌రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆయ న హాజరై మాట్లాడుతూ ఏయే పనులు చే యాలి, ఎంతమేర నిధులు కావాలన్న నివేదికలు సిద్ధం చేయాలన్నారు. అలాగే ప్రతి ఇంటి వివరాలు సేకరించి నమోదు చేయాలన్నారు. బ్యాంకు ఖాతాకు, ఆధార్‌నంబర్ అనుసంధా నం చేసే కార్యక్రమం పూర్తిస్థాయిలో చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జలజాక్షి, ఈవోఆర్‌డి నారాయణ, సర్పంచులు, వీవోఏలు, కార్యదర్శులు, డిఏలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో మోహన్‌రావు

విద్యుత్ చార్జీల పెంపు ఉపసంహరించాలి

- విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా



విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న ఆందోళనకారులు

సైదాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి డీపీ పోలయ్య మాట్లాడుతూ విద్యుత్ ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై మోపే భారాన్ని ప్రభుత్వమే భరించాలన్నారు. విద్యుత్ చార్జీలు ఉపసంహరించకపోతే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు చంగళ్‌రావు, వెంకటయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్స్ కాలనీలో సమస్యలు పరిష్కరిస్తా

- రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



టిఫిన్ అంగడి నిర్వాహకురాలితో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే

నెల్లూరురూరల్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): నగరంలోని 26వ డివిజన్ డ్రైవర్స్ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తానని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. శనివారం ఆయన ఆ ప్రాంతంలో పర్యటించి చిరు, రోడ్డు మార్జిన్ వ్యాపారులు, ప్రజలతో మాట్లాడి కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎదురవుతున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్డు, డ్రైనేజీ కాలువల నిర్మాణాలకు రూ.కోటి కేటాయించి పనులు త్వరలో మొదలుపెట్టిస్తానని చెప్పారు. ఇళ్ల వద్ద పేరుకుపోయిన జమ్మును వారం రోజుల వ్యవధిలో తొలగిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ బూడిద సుప్రజ, నాయకులు పురుషోత్తం, సురేంద్రబాబు, శివాచారి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత వస్త్రాలు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కేవీఆర్ పెట్రోలు బంకు ఎదురుగా ఉన్న కళాంజలి ఆర్ట్‌అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌లో చేనేత వస్త్రాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ ఎగ్జిబిషన్‌లో చేనేతలు, హస్త కళా వస్తువులను ఉత్పత్తి ధరలకే వినియోగదారులకు విక్రయిస్తున్నారు. ఇందులో కళంకారీ, బెంగాల్‌కాటన్, బాగల్‌పూర్, ఫ్యాన్సీ చీరలు, కాశ్మీరీ టాప్స్, జైపూరు బెడ్‌షీట్స్, వరంగల్ టవల్స్ నిత్య నూతన మోడల్ శారీలు, ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. షరానేపూర్ ఉడ్‌మెటీరియల్స్, డైనింగ్ టేబుల్స్, కుర్చీలు, అలంకరణ వస్తువులను నెల్లూరు ప్రజలు విరివిగా కొనుగోలు చేస్తూ ఆదరిస్తున్నందుకు ఎగ్జిబిషన్ నిర్వాహకుడు శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు.



వస్త్రాలను ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

రూ.4లక్షలతో చప్టా ఏర్పాటు

మనుబోలు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అక్కంపేట-కురిచెర్లపాడు మధ్య రూ. 4లక్షలతో తాత్కాలికంగా చప్టా ఏర్పాటు చేయిస్తున్నట్లు ఎమ్మెల్యే తనయుడు, సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఇటీవల వర్షాల కు కుంగిపోయిన చప్టాను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈమార్గంలో రైతులు వ్యవసాయ పనులకు ఈ చప్టాపై రాకపోకలు సాగిస్తారని, దీంతో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు ఉస్వర్, రాజశేఖర్, టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, రామకృష్ణయ్య, కోదండరామిరెడ్డి, అమీర్‌భాషా, రామ్మోహన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, బీజేపి మండలాధ్యక్షుడు పి. కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవేలి ఉత్సవం

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం మండల పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నిర్మాల్య దర్శనం, పాలాభిషేకం, మహాగణపతి హోమం, ఉషఃపూజ, శ్రీవేలి ఉత్సవం, కలశపూజ, ఉచ్ఛ పూజ జరిగాయి. మధ్యాహ్నం అయ్యప్పలకు అన్నప్రసాదాలు వితరణ జరిగింది. సాయంత్రం పూలంగిసేవ జరిగింది ఉభయకర్తలుగా ఊటుకూరు శ్రీనివాసులురెడ్డి, శైలజ, సత్యనారాయణరెడ్డి, మాలిని వ్యవహరించారు. ఆలయ చైర్మన్ జి.శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం, గడ్డం రత్నయ్య పర్యవేక్షించారు.

గిరిజన కుటుంబాలను ఆదుకోండి

విడవలూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గత కొన్నిరోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో ఇబ్బందులు పడుతున్న గిరిజన కుటుంబాలను ఆదుకోవాలని దళిత సంఘం మహిళా నాయకురాలు పల్లం శేషమ్మ డిమాండ్ చేశారు. శనివారం ఆమె స్థానిక కామాక్షినగర్ వరద ముంపులోని ప్రజలకు ఆహార ప్యాకెట్లను అందజేశారు. నాలుగురోజులగా ప్రజలు నీటిలో నివాసం ఉంటున్న అధికారులు, నాయకులు పట్టించుకోలేదని మండిపడ్డారు. ఆమె వెంట జడ్డా స్వామి దాసు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ హర్షం

రాపూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ఏకసభ్య కమిషన్ నియమకాన్ని స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గోవిందు రంగయ్య మాదిగ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వలన ఎవరికీ అన్యాయం జరగదన్నారు. సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.

భూదేవి కాంప్లెక్సులో సిట్ కార్యాలయం

● త్వరలో అధికారికంగా ప్రారంభం



తిరుపతి(నేరవిభాగం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడకంపై విచారణ కోసం నియమించిన సీబీఐ సిట్ కోసం టీటీడీ భూదేవి కాంప్లెక్సులోని పాత ఎస్వీబీసీ కార్యాలయం కేటాయించారు. ఇక్కడ సిట్ అధికారులకు అవసరమైన కంప్యూటర్ గదులు, విచారణకు అవసరమైన ప్రత్యేక వసతులు, డీఎస్పీలు, సీఐలకు, అధికారులు వేచి ఉండేందుకు అన్ని రకాల వసతులు ఉండటంతో దీనిని ఎంపిక చేసినట్లు తెలిసింది. ఈ మేరకు టీటీడీకి ప్రత్యేక లేఖ రాయడంతో పాత ఎస్వీబీసీ కార్యాలయాన్ని కేటాయించడానికి అధికారికంగా అంగీకరించారు. ఈ విషయాన్ని సిట్ బృందంలోని ఓ అధికారి శనివారం రాత్రి ధ్రువీకరించారు. విచారణకు అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇతరత్రా పరికరాలను సమకూర్చనున్నారు. సిట్‌లో ఇద్దరు సీబీఐ అధికారులతో పాటు రాష్ట్ర పోలీసు శాఖ నుంచి మరో ఇద్దరు అధికారులు, ఆహార కల్తీ నిరోధక శాఖ నిపుణుడు ఉంటారు. వీరికి సహాయంగా నలుగురు డీఎస్పీలు, 8 మంది సీఐలు, ఇద్దరు ఎస్ఐలతో పాటు మరికొందరు సిబ్బంది ఉంటారు. వీరందరూ కలసి దాదాపు 30 నుంచి 35 మంది ఉంటారని ఓ అధికారి తెలిపారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. వీలైనంత త్వరలో అన్ని ఏర్పాట్లతో కార్యాలయం ప్రారంభించడానికి పోలీసు అధికారులు, టీటీడీ చర్యలు చేపట్టింది.

ఇండియన్ బ్యాంక్ | ఇండియన్ బ్యాంక్ | ఇలహాబాద్ | అలహాబాద్

అన్నాసలై శాఖ
నం.41,అన్నా థియేటర్ బిల్డింగ్, అన్నాసలై,
చెన్నై - 600 002, టెలిఫోన్ : 044-28516194, 28549262
ఇమెయిల్ : annasalai@indianbank.co.in

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 మరియు 9తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ **ఇండియన్ బ్యాంక్** అధీకృత అధికారియగు దిగువ సంతకందారు సదరు ప్రకటన తేదీ నుండి 60 రోజుల్లోగా ప్రకటనలో తెలిపిన మొత్తం 02.08.2024 నుండి చెల్లింపు తేదీ వరకు తదుపరి వడ్డీ మరియు వ్యయాలతో **రూ.1,87,01,711/- (రూపాయలు ఒక కోటి ఎనభైఏడు లక్షల ఒక వెయ్యి ఏడువందల పదకొండు మాత్రమే)** లను మా అన్నాసలై శాఖకు తిరిగి చెల్లించాలని రుణగ్రహీత(లు) హామీదారు(లు): **(1) M/s. ఇండిగ్రా గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ (రుణగ్రహీత)**, ప్లాట్ నం.13, నారాయణస్వామి నగర్, పూనమల్లె, చెన్నై-600056. **(2) శ్రీ అరవింద్ చుగ్ (భాగస్వామి-1)**, డోర్ నం.7/9-1, ప్యాలెస్ క్రాస్ రోడ్, 2వ మెయిన్ రోడ్, బి/హెచ్ ఫోర్డ్ షోరూం, చందావార్‌కర్ లేఅవుట్, బెంగళూరు, కర్ణాటక - 560020 మరియు నం.1612, గ్రాండ్ చివార్, అరుణ బరిడేజ్, గోవా - 403509. **(3) శ్రీ ఎ. మోహన్‌రాజ్ (భాగస్వామి-2)**, డోర్ నం.47, గ్రౌండ్ ఫ్లోర్, 2వ వీధి, కెకె గార్డెన్స్, సుమిత్రా నగర్, పూనమల్లె, ఎస్ఆర్ అంజనేయర్ కోయిల్, చెన్నై-600056 వారిని కోరుతూ **01.08.2024** తేదీ గల డిమాండ్ ప్రకటన జారీ చేసారు.

మొత్తం బకాయి తదుపరి వడ్డీ, వ్యయాలు, ఇతర చార్జీలు మరియు ఖర్చులతో **10.11.2024** నాటికి **రూ.1,78,15,144/- (రూపాయలు ఒక కోటి డెబ్బై ఎనిమిది లక్షల పదిహేను వేల నూట నలభైనాలుగు మాత్రమే).**

రుణగ్రహీత & హామీదారులు సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుని దిగువ ఇందులో వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **11 నవంబర్ 2024**న స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీత & హామీదారులు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమైనది.

ఆస్తితో ఎట్టి వ్యవహారాలూ జరపరాదని ముఖ్యంగా రుణగ్రహీత, హామీదారులు & తనఖాదారులు మరియు సాధారణ ప్రజానీకాన్ని హెచ్చరించడమైనది. సదరు ఆస్తితో జరిపే ఎట్టి వ్యవహారమైన **10.11.2024** నాటికి మొత్తం **రూ.1,78,15,144/- (రూపాయలు ఒక కోటి డెబ్బై ఎనిమిది లక్షల పదిహేను వేల నూట నలభైనాలుగు మాత్రమే)** మరియు దానిపై తదుపరి వడ్డీ మరియు వ్యయాలు ఇండియన్ బ్యాంక్ చార్జీకి లోబడి ఉంటుంది.

"సెక్యూరిటీలను విడిపించుకొను మీ హక్కులతో వ్యవహరించుటకు రూపొందించబడిన రూల్స్ మరియు SARFAESI చట్టంలోని సెక్షన్ 13(8) నిబంధనలను మీరు గమనించగలరు."

స్థిరాస్తి వివరణ:

సెక్యూరిటీ ఇంటరెస్ట్‌తో ఆస్తుల నిర్దిష్ట వివరాలు దిగువ తెలుపబడినవి.

తనఖాపెట్టబడిన ఆస్తి: సూళ్లూరుపేట సబ్ రిజిస్ట్రేషన్ జిల్లా మరియు గూడూరు రిజిస్ట్రేషన్ జిల్లాలో 2.00 ఎకరాలు మరియు 25 సెంట్ల విస్తీర్ణం మొత్తంలో ఒక భాగస్వామ్య సంస్థ, మెసర్స్ ఇండిగ్రా గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ పేరున గల ఆంధ్రప్రదేశ్ - 524121, నెల్లూరు జిల్లా, తడ మండలం, అక్కంపేట పోస్ట్, గ్రద్దగుంట గ్రామంలో సర్వే నం.39/2ఎ, డోర్ నం.39/2ఎ వద్ద గల ఇతర ఆస్తులు (అస్బెస్టాస్ షీట్స్ షెడ్ 9600 చ.అ.లు + ఆర్‌సిసి రూఫ్ 3000 చ.అ.లు) తో పాటు భవనంతో పారిశ్రామిక భూములు యావత్తు. **సరిహద్దులు:** ఉత్తరం: గ్రద్దగుంట గ్రామ పబ్లిక్ రోడ్డు, దక్షిణం: ఎస్‌జెఎల్‌టి భూములు మరియు ఎన్‌హెచ్-5లో ముగిసే 20అ.లు, తూర్పు: సర్వే నం.53లో భూమి, పశ్చిమం: 20 అ.ల రోడ్డు.

తేది:11.11.2024 | అధీకృత అధికారి
ప్రదేశం: తడ | ఇండియన్ బ్యాంక్

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.12 కోట్లు

తిరుమల, నవంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.12 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 61,613 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 20,291 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
6
తిరుపతి
జిల్లా వార్తలు
ఆదివారం 17 నవంబరు 2024

నేడు నారావారిపల్లెలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు

హాజరు కానున్న నారా, నందమూరి కుటుంబీకులు

ఆత్మబంధువు అస్తమయం





- చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు మృతితో తల్లడిల్లుతున్న నారావారిపల్లె

తిరుపతి, ఆంధ్రజ్యోతి

నారావారిపల్లె తల్లడిల్లుతోంది. సుదీర్ఘకాలంగా అనారోగ్యంతో వున్న నారా రామ్మూర్తినాయుడు కన్నుమూసిన వార్త తెలిసి కన్నీరుమున్నీరవుతోంది. ఈ వార్త తెలిసినప్పటి నుంచీ బంధుమిత్రులు పెద్దసంఖ్యలో నారావారిపల్లెకు చేరుకుంటున్నారు. ఆయనతో అనుబంధాన్ని గుర్తుచేసుకుంటున్నారు. ఒకరినొకరు ఓదార్చుకుంటున్నారు. హైదరాబాద్ నుంచి ఆదివారం ఉదయం రానున్న భౌతికకాయం కోసం ఎదురుచూస్తున్నారు.

కుటుంబం

ఖర్జూరనాయుడు, అమ్మణ్ణమ్మల మూడో బిడ్డ నారా రామ్మూర్తినాయుడు. వీరికి నలుగురు పిల్లలు. అందరిలోకీ పెద్ద చంద్రబాబు. తర్వాత హైమావతి, ఆమె తర్వాత రామ్మూర్తి నాయుడు, ఆయన తర్వాత రాజేశ్వరి. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ చదువుతూ మధ్యలో ఆపేశారు. శ్రీకాళహస్తి సమీపంలోని కోబాక గ్రామానికి చెందిన ఇందిరతో పెళ్లయ్యింది. వీరికి ఇద్దరు కుమారులు గిరీష్, రోహిత్. రోహిత్ సినిమా హీరోగా ప్రసిద్ధులు. గిరీష్ గల్ఫ్‌లో వ్యాపారవేత్తగా ఉన్నారు. పదహైదేళ్లుగా అనారోగ్యంతో ఉన్న రామమూర్తినాయుడు 72 ఏళ్ల వయసులో కన్నుమూశారు.

నేడు నారావారిపల్లెలో అంత్యక్రియలు

రామ్మూర్తినాయుడు భౌతిక కాయం ఆదివారం ఉదయం 8 గంటలకు హైదరాబాదు నుంచి విమానంలో రేణిగుంట విమానాశ్రయం చేరుకోనుంది. అక్కడి నుంచి రోడ్డు మార్గాన 9.30 గంటలకు నారావారిపల్లె తరలిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తారు. సీఎం చంద్రబాబు సహా నారా, నందమూరి కుటుంబసభ్యులు పలువురు అంత్యక్రియలకు హాజరు కానున్నారు. ఇంకా, ఏపీ, తెలంగాణ నుంచి వివిధ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యే అవకాశముంది.

1994లో చంద్రగిరి విజేత

రామ్మూర్తినాయుడు 1992 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. అప్పటిదాకా అన్న చంద్రబాబునాయుడికి చేదోడుగానే ఉండేవారు. చంద్రగిరిలో మణిమంతు నాయుడు, ఎల్‌బీ ప్రభాకర్ వంటి నాయకులున్నా 1994లో టీడీపీ అధినేత ఎన్‌టీ రామారావు ఆశీస్సులు రామ్మూర్తినాయుడికే లభించాయి. చంద్రగిరి ఎమ్మెల్యే టికెట్ దక్కించుకున్న ఆయన ఆ ఎన్నికల్లో గల్లా అరుణకుమారిపై 16వేలకు పైగా ఆధిక్యంతో గెలిచారు. చంద్రగిరి, పాకాల, పులిచెర్ల, ఐరాల మండలాలతో కూడిన చంద్రగిరి నియోజకవర్గంలో రాజకీయంగా ఆయన నూతన ఒరవడి సృష్టించారు. కార్యకర్తలకు పూర్తి సమయం అందుబాటులో ఉండేవారు. ప్రజలతోనూ, కార్యకర్తలతోనూ కలుపుగోలుగా వుండేవారు. మీడియా ప్రతినిధులను సైతం అన్నా, తమ్ముడూ, మామా అంటూ వరుసలు పెట్టి పిలిచేవారు. కేవలం సిఫారసు లేఖలు ఇవ్వడంతో సరిపెట్టుకోకుండా అధికారుల వెంటపడి మరీ ఆ పనులు అయ్యేదాకా పట్టుదలగా వ్యవహరించేవారు. చంద్రగిరి నియోజకవర్గంలో కమ్మ, రెడ్డి సామాజికవర్గాల ప్రాబల్యం అధికంగా వున్నప్పటికీ రెండు కులాల మధ్యా ఎలాంటి తేడా చూపకుండా వారికి దగ్గరయ్యారు. సీఎం చంద్రబాబు సోదరుడిననే అహం ఇసుమంతైనా చూపే వారు కాదు. ఇతర పార్టీల నేతలతో కూడా కలుపుగోలుగా మెలిగారు.

కాణిపాకం మాస్టర్‌ప్లాన్ మూలకర్త

చంద్రగిరి ఎమ్మెల్యేగా రామ్మూర్తినాయుడు కాణిపాకం వినాయక ఆలయ అభివృద్ధికి మూలకారకుడిగా పేరు తెచ్చుకున్నారు. 1994కు మునుపు ఆలయమూ, ఆలయానికి వెళ్ళే రోడ్డు ఇరుకైన స్థలంలో ఉండేవి. విస్తరణకు వీలు లేని విధంగా చుట్టూ వ్యవసాయ భూములు, ప్రైవేటు నివాసాలు, దుకాణాలు వుండేవి. రామ్మూర్తినాయుడు ఎమ్మెల్యే అయ్యాక దేవాదాయ, రెవెన్యూ, పంచాయతీ అధికారులతోపాటు ఉభయదారులతో కలసి ఆలయ విస్తరణకు, అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ఆలయం చుట్టూ భూములున్న రైతులు, సొంతదారులను ఒప్పించి భూములను సేకరించి ఆలయాన్ని విశాలంగా విస్తరించారు. అలాగే చిత్తూరు-ఐరాల రోడ్డులోని అగరంపల్లె వద్ద ప్రధాన స్వాగత తోరణం నిర్మించారు. అక్కడి నుంచి కాణిపాకానికి డబుల్ రోడ్డు నిర్మించారు. ఆలయంలో ఆర్జిత సేవలనూ మెరుగుపరిచి భక్తులు పెరిగేందుకు కారకులయ్యారు. అప్పటికి ఎన్నో ఏళ్ళుగా తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేస్తున్న ఆలయ సిబ్బందిని రెగ్యులర్ ఉద్యోగులుగా సర్వీసు క్రమబద్ధీకరణ చేయించారు. ఇవాళ కాణిపాకం ఆలయం రాష్ట్రంలోని 6-ఏ కేటగిరీ ఆలయాలు ఆరింటిలో ఒకటిగా వుండడానికి రామ్మూర్తినాయుడే కారణమని చెప్పవచ్చు.

అనుచరులకు అండగా

తన వెన్నంటివున్నవారికి బలమైన అండగా ఉండేవారు. పన్నెండేళ్ళకు పైగా తనవద్ద డ్రైవరుగా పనిచేసిన నాగరాజుకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని అనుకున్నారు. ఆయన దానికి బదులు చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మ ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ పదవి తనకు ఇప్పించాలని కోరారు. నియోజకవర్గంలో ప్రధాన ఆలయమైనప్పటికీ రామ్మూర్తి నాయుడు ఆ పదవిని నాగరాజుకు ఇప్పించారు.

1999లో మలుపు తిరిగిన జీవితం

చంద్రగిరి ఎమ్మెల్యేగా 1994-99 నడుమ విజయవంతంగా పనిచేసిన రామ్మూర్తినాయుడు రాజకీయ, వ్యక్తిగత జీవితం 1999 ఎన్నికల్లో ఓటమి తర్వాత మలుపు తిరిగింది. 1999-2004 నడుమ ఆయన రాజకీయంగా సంక్షోభాన్ని ఎదుర్కొన్నారు. 1999 ఎన్నికల్లో టీడీపీ తరపున రెండో పర్యాయం పోటీ చేసిన ఆయన కేవలం 2271 ఓట్ల స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. నియోజకవర్గంలో కొందరు టీడీపీ ముఖ్య నాయకులు ఆయన గెలుపునకు సహకరించలేదన్న ఆరోపణలు అప్పట్లో వచ్చాయి. ఓటమి తర్వాత ఆయనకు పార్టీలో ప్రాధాన్యం తగ్గుతూ వచ్చింది. తదుపరి ఎన్నికల్లో టికెట్ దక్కే పరిస్థితి లేదని తెలియడంతో 2003లో ఆయన టీడీపీని వీడారు. చంద్రబాబును రాజకీయంగా దెబ్బ తీయడానికి రామ్మూర్తినాయుడిని వాడుకునే వ్యూహానికి కాంగ్రెస్ పార్టీ పెద్దలు యత్నించారు. ఆయన్ను కాంగ్రెస్‌లో చేర్చుకున్నప్పటికీ 2004 ఎన్నికల్లో చంద్రగిరి అసెంబ్లీ టికెట్ ఇవ్వలేదు. దీంతో ఆయన కాంగ్రెస్ నుంచీ బయటికొచ్చారు. అప్పట్లో తిరుపతి బాలాజీ కాలనీ కూడలిలో కాంగ్రెస్ అధినేత సోనియా కటౌట్‌లు తగులబెట్టడం సంచలనం రేపింది. ఆ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగి టీడీపీ కంటే ఎక్కువ ఓట్లు సాధించి నియోజకవర్గంలో తన బలాన్ని చాటారు. కాంగ్రెస్ అభ్యర్థి గల్లా అరుణకుమారికి 46,838 ఓట్లు రాగా, రామ్మూర్తి నాయుడుకు 36 వేల ఓట్లు వచ్చాయి. టీడీపీ అభ్యర్థికి 32 వేల ఓట్లు పడ్డాయి.



2020 మార్చి 18న తన జన్మదినం సందర్భంగా భార్య ఇందిర, కుమారులు రోహిత్, గిరీష్‌తో రామ్మూర్తి నాయుడు

15 ఏళ్ల అనారోగ్యం

1999 ఓటమి తదనంతర పరిణామాలలో తీవ్ర మానసిక క్షోభకు గురయ్యారు. ఆ క్రమంలోనే అనారోగ్యానికి లోనయ్యారు. క్రమేపీ అల్జీమర్స్ లక్షణాలతో కుటుంబీకులను, పరిచయస్తులను గుర్తించలేకపోయారు. చంద్రబాబు చొరవ తీసుకుని కేరళలో ఆయుర్వేద వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. దీంతో ఇంటికే పరిమితమయ్యారు. గత పదిహేనేళ్ళుగా చంద్రబాబు, రామ్మూర్తినాయుడు కుటుంబాలు రెండూ ఆయనను జాగ్రత్తగా కనిపెట్టుకుంటూ వచ్చాయి. అనారోగ్యానికి వయోభారం తోడు కావడంతో పరిస్థితి దిగజారింది. వారం రోజుల కిందట హైదరాబాదులోని ఏఐజీ ఆస్పత్రిలో చేర్పించడంతో చికిత్స తీసుకుంటూ శనివారం ఉదయం కన్నుమూశారు.

సీఎం సొంతూరులో భారీ భద్రత

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలో ఆదివారం రామ్మూర్తినాయుడి అంత్యక్రియల నేపథ్యంలో పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. శనివారం మధ్యాహ్నమే ఎస్పీ సుబ్బరాయుడు గ్రామానికి చేరుకుని అక్కడ తీసుకోవాల్సిన బందోబస్తు చర్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు, సీఎం బంధువులతో సమావేశమయ్యారు. సీఎంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, టీడీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరవుతుండడంతో భద్రతా చర్యలపై దృష్టి పెట్టారు. ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ రవి మనోహరాచ్చారి, తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ, చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, తిరుపతి, చంద్రగిరి పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. సీఎం నివాసం వద్ద ఏర్పాట్లను ఎస్పీ పర్యవేక్షిస్తున్నారు. నారావారిపల్లెకు వెళ్లే అన్ని రహదారుల వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. డీఐజీతో పాటు ఎస్పీ సుబ్బరాయుడు, అదనపు ఎస్పీలు నలుగురు, 10 మంది డీఎస్పీలు, 30 మంది సీఐలు, 100 మంది ఎస్‌ఐలు, మరో 200 మంది ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 800 మంది కానిస్టేబుళ్లు, రిజర్వు బలగాలు, డాగ్, బాంబు నిర్వీర్యం స్క్వాడ్‌లు, రోప్ పార్టీలు, రోడ్డు డిగ్గింగ్ సిబ్బంది, మెటల్ డిటెక్టర్ టీమ్‌లు బందోబస్తు విధుల్లో ఉన్నారు. మరోవైపు పోలీసు అధికారులతో ఎస్పీ సుబ్బరాయుడు అత్యవసర సమావేశం నిర్వహించారు. భౌతిక కాయం వద్దకు అనుమతి ఉన్న వారినే పంపేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వీఐపీలు, ప్రముఖులు, పార్టీల నాయకులు, బంధువులు, ఇతర అనుచరులకు వేర్వేరుగా షామియానాలు ఏర్పాటు చేశారు. కలెక్టర్ అనుమతి మేరకు మాత్రమే భౌతికకాయం వద్దకు పంపాలని, మిగిలిన వారిని సందర్శన నిమిత్తం కొంత దూరం నుంచే పంపేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



నారావారిపల్లెలో సీఎం ఇంటి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, కమిషనర్

నారావారిపల్లెలో ఏర్పాట్లు

చంద్రగిరి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లెకు ఆదివారం ఉదయం నారా రామ్మూర్తినాయుడి భౌతికకాయం రానుంది. మధ్యాహ్నం అంత్యక్రియలు జరగనున్నాయి. రామ్మూర్తినాయుడు కుటుంబ సభ్యులతో పాటు సీఎం చంద్రబాబు, మంత్రులు, నారా, నందమూరి కుటుంబ సభ్యులు, కూటమి నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరుకానున్నారు. దీంతో శనివారం సాయంత్రం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, తిరుపతి కార్పొరేషన్ కమిషనరు మౌర్య, పలువురు జిల్లా అధికారులు నారావారిపల్లెలో ఏర్పాట్లను పరిశీలించారు. అంత్యక్రియల ఏర్పాట్లను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పర్యవేక్షిస్తున్నారు.

నేడు ప్రముఖుల రాక

- నారావారిపల్లె రానున్న సీఎం చంద్రబాబు, మహారాష్ట్ర గవర్నర్, వీఐపీలు

తిరుపతి(కలెక్టరేట్/నేరవిభాగం), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలో ఆదివారం నారా రామ్మూర్తినాయుడు భౌతిక కాయానికి నివాళులర్పించడానికి వీవీఐపీలు రానున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు హైదరాబాదు నుంచి ఉదయం పది గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ్నుంచి రోడ్డు మార్గాన స్వగ్రామానికి చేరుకుని తమ్ముడి అంత్యక్రియల్లో పాల్గొంటారు. మంత్రి నారా లోకేశ్ కూడా ఉదయం 5.15 గంటలకు ఏఐజీ ఆస్పత్రికి చేరుకుంటారు. అక్కడ్నుంచి 6గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని ప్రత్యేకవిమానంలో 7.45 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 8.30 గంటలకు నారావారిపల్లెకు చేరుకుంటారని కలెక్టర్ వెంకటేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే, మహారాష్ట్ర గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్ ఉదయం 9.45గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ్నుంచి నారావారిపల్లె చేరుకుని రామ్మూర్తి భౌతికకాయానికి నివాళులు అర్పిస్తారు. 11.45 గంటలకు తిరుగు ప్రయాణమై పద్మావతి అతిథి గృహానికి చేరుకుంటారు. సాయంత్రం 4గంటలకు విమానంలో బెంగళూరు వెళతారు. ఇంకా, రాష్ట్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ప్రముఖులు హాజరుకానున్నారు.

చంద్రగిరి ప్రజలకు ఎనలేని సేవలు

చంద్రగిరి ఎమ్మెల్యేగా ఆ నియోజకవర్గ ప్రజలకు రామ్మూర్తి ఎనలేని సేవలు అందించారు. జిల్లాలో మాస్ లీడర్ అంటే ఆయనే. ఆయన మృతి ప్రజలకు తీరని లోటు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి.

- ఆరణి శ్రీనివాసులు, తిరుపతి ఎమ్మెల్యే

పార్టీ వేరైనా అభివృద్ధికి సహకరించేవారు

చంద్రగిరి ఎమ్మెల్యేగా ఆయన పనిచేసిన కాలంలో నేను తిరుపతి రూరల్ చెర్లోపల్లి సర్పంచిగా ఉన్నా. పంచాయతీ అభివృద్ధికి ఎంతో ఉదారంగా నిధులు కేటాయించారు. సర్పంచ్‌గా ఎప్పుడు కలిసినా ఆప్యాయంగా పలకరించే వారు. మా పార్టీలు వేరైనప్పటికీ అభివృద్ధి విషయంలో ఎంతో తోడ్పాటు అందించారు. ఆయన మరణం నాకే కాదు.. సాధారణ ప్రజలకూ ఎంతో లోటు.

- రామానాయుడు, సీపీఐ నేత

మంచి మిత్రుడ్ని కోల్పోయాం

అందరితో కలుపుగోలుగా ఉండే రామ్మూర్తి నాయుడు మృతితో మంచి మిత్రుడ్ని కోల్పోయామని స్థానిక టీడీపీ నేతలు దిగ్భ్రాంతి చెందారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. యాదవ సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, టౌన్ బ్యాంక్ మాజీ ఛైర్మన్ పులుగోరు మురళీకృష్ణా రెడ్డి తదితరులు సంతాపం తెలిపారు. రామ్మూర్తి మృతి చంద్రగిరి ప్రజలకు తీరనిలోటని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. **- తిరుపతి, ఆంధ్రజ్యోతి**

రామ్మూర్తితో మా అనుబంధం



ఎలా మెలగాలో నేర్పిన రాజకీయ గురువు

రామ్మూర్తి నాయుడు ద్వారా రాజకీయాల్లోకి వచ్చా. ప్రజలతో, టీడీపీ కుటుంబ సభ్యులతో ఎలా మెలగాలో, ఒక మాస్ లీడర్‌లా ఎలా ఉండాలో నేర్పించిన వ్యక్తి ఆయన. నియోజకవర్గ ప్రజలలో ఇప్పటికీ ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. ఆయన మృతి తీరని లోటు.

- పులివర్తి నాని, చంద్రగిరి ఎమ్మెల్యే

కుటుంబ సభ్యుడిలా చూశారు



రామ్మూర్తి నాయుడి కారుకు 12 ఏళ్లుగా డ్రైవర్‌గా ఉన్నాను. ఎప్పుడూ నన్ను డ్రైవర్‌గా చూడలేదు. కుటుంబ సభ్యుడుగానే చూశారు. 2001లో మూలస్థాన ఎల్లమ్మ ఆలయ ఛైర్మన్ పదవి ఇప్పించారు. ఒకసారి మాట ఇస్తే ఆ సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాగతారు. ఆయనకు ఆరోగ్యం బాగాలేక ఇంటి వద్దే ఉండటంతో డ్రైవర్‌గా నిలిచిపోయాను. ఆయన మృతి జీర్ణించుకోలేకపోతున్నా.

- అన్నసాని నాగరాజు, మాజీ చైర్మన్, మూలస్థాన ఎల్లమ్మ ఆలయం



బామ్మర్ది అంటూ పిలిచేవారు

ఎప్పుడూ బామ్మర్ది అంటూ ఆప్యాయంగా పిలిచేవారు. నన్ను మొదటిసారి విమానంలో తీసుకెళ్లారు. ఆయనకు ఆరోగ్య సమస్య మొదలైనప్పుడు దగ్గరే ఉన్నాను. నన్ను పెద్దాయన(చంద్రబాబునాయుడు) వద్దకు తీసుకెళ్లి మన ఆడబిడ్డ కొడుకు అన్నా బాగా చూసుకోవాలి, కష్టపడతాడు. మంచి విద్యార్థి నాయకుడు అని చెప్పారు. రాజకీయంగా నన్ను ఎంతగానో ప్రోత్సహించారు.

- అనిమిని రవినాయుడు, శాప్ చైర్మన్

24 ఏళ్లకే సర్పంచిని చేశారు



నారా రామ్మూర్తి నాయుడుని సన్మానిస్తున్న సురేష్‌రెడ్డి

రామ్మూర్తినాయుడి అనుచరుడిగా ఉన్నందుకు నన్ను రాజకీయంగా ప్రోత్సహించి 24 ఏళ్లకే శానంబట్ల సర్పంచిని చేశారు. కాంగ్రెస్‌కు కంచుకోట అయినా నాకోసం ఆ ఎన్నికలలో ఇంటింటా తిరిగారు. రామ్మూర్తి దంపతులు దగ్గరుండి నా పెళ్లి చేశారు. ఆయన స్ఫూర్తితోనే రాజకీయాల్లో కొనసాగుతున్నా. ఆయన మృతి బాధాకరం.

- ముడిపల్లి సురేష్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్

ఆయన స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చా



నారా రామ్మూర్తి నాయుడితో గౌస్‌బాషా

రామ్మూర్తి స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చా. చిన్న వయస్సు నుంచీ ఆయన వెంట తిరిగా. 24 ఏళ్ల వయసులోనే ఎంపీటీసీగా పోటీ చేశా. రాజకీయాల్లో సేవ చేయడం ఆయన్ను చూసే నేర్చుకున్నాం. ఆయన మృతి టీడీపీకి తీరని లోటు.

- గౌస్‌బాషా, మాజీ ఎంపీటీసీ, చంద్రగిరి



స్నేహితుల్లా ఉండేవాళ్లం

రామ్మూర్తి నాయుడు ఎమ్మెల్యేగా ఉన్నా స్నేహితుల్లా ఉన్నాం. నన్ను కుమార్ బావా అని ఆప్యాయంగా పిలిచేవారు. నాయకులు, కార్యకర్తలనే తేడా లేకుండా ప్రతి ఒక్కరిని పేరుపేరునా బావా, మామా, బామ్మర్ది, అన్నా, తమ్ముడు అంటూ పిలిచేవారు. మంచి నాయకుడిని కోల్పోయాం.

- మొక్కల కుమారరాజారెడ్డి, టీడీపీ నేత, చంద్రగిరి

రూ.2 కోసం సాయంత్రం వరకు సర్వే చేయించారు



మాఊరు రవణప్పగారిపల్లె. ఆయన ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తిరుపతి నుచి మాఊరుకి రావాలంటే పనపాకం వరకు రూ.7, మాఊర్లో దిగాలంటే రూ.9 చార్జీ. ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లాం. వెంటనే ఆర్టీసీ అధికారులను పిలిపించి ఉదయం నుంచి సాయంత్రం వరకు బస్సు స్టేజీ కోసం సర్వే చేయించారు. అప్పట్లో ఆయన చేసిన కొత్త స్టేజీ ఏర్పాటు చేయించడంతో ఇప్పుడు రూ.పది తగ్గుతుంది.

- వడ్లమూడి సారథినాయుడు, సౌదీ అరేబియా సోషల్ మీడియా కోఆర్డినేటర్

- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి

ఊరూరా సంక్షేమ పథకాలు

పాకాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాకాల మండలంలోని గ్రామాలలో సంక్షేమానికి పెద్దపీట వేసి ఊరూరా సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడికి దక్కింది. మొగరాల దామలచెరువు రోడ్డు, కొమ్మేపల్లె నుంచి కృష్ణాపురం మీదుగా ఊట్లవారిపల్లె వరకు పలు గ్రామాలను కలుపుతూ రోడ్డు వేయించారు. పెద్ద ఎత్తున గృహాలు మంజూరు చేయించారు. 107 గ్రామాలలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు నిర్మించి తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. దామలచెరువులో షాదీమహల్ నిర్మాణం, ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కృషిచేశారు. మద్దినాయనిపల్లె, గానుగపెంట గ్రామాల పరిసరాలలో పలు అభివృద్ధి పనులు చేశారు.

డీఎస్సీ ఉచిత శిక్షణ ప్రారంభం



తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉచిత మెగా డీఎస్సీ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. బీసీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో తిరుపతి నగరం ఎంఆర్‌పల్లె కూడలి సమీపంలో ఏర్పాటు చేసిన మెగా డీఎస్సీ ఉచిత కోచింగ్ కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కోచింగ్ సమయంలో స్టైఫండ్, పుస్తకాలు ఇస్తారన్నారు. 220 మంది అభ్యర్థులకు 60 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్, రాష్ట్ర నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, అధికారులు చంద్రశేఖర్, లక్ష్మి, చెన్నయ్య, జ్యోత్స్న, అభ్యర్థులు పాల్గొన్నారు.

ఆ ఇద్దరు తహసీల్దార్లకు పోస్టింగ్ ఇవ్వండి

- కలెక్టర్‌కు సీసీఎల్‌ఏ ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తహసీల్దార్లు సురేష్‌బాబు, పరమేశ్వరస్వామి ఉన్న సస్పెన్షన్‌ను సీసీఎల్‌ఏ ఎత్తివేసింది. వారిద్దరికి తిరిగి పోస్టింగ్ ఇవ్వాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌కు సీసీఎల్‌ఏ నుంచి శనివారం ఉత్తర్వులు అందాయి. పుత్తూరుకు చెందిన ఓ వ్యక్తి పెట్రోల్‌బంక్‌కు అనుమతికి ఎన్‌వోసీ జారీ చేసేందుకు అప్పటి తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డి నగదు డిమాండు చేశారనే ఆరోపణలపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ప్రభుత్వం రెండు నెలలక్రితం ఆయన్ను సస్పెండ్ చేసింది. ఇదే ఘటనలో ఆరోపణలు ఎదుర్కొన్న అప్పటి రేణిగుంట తహసీల్దారు సురేష్‌బాబు, ఎర్రావారిపాళెం తహసీల్దారు పరమేశ్వరస్వామిని సీసీఎల్‌ఏ సస్పెండ్ చేసింది. వీరు హైకోర్టును ఆశ్రయించారు. సస్పెన్షన్ ఆర్డర్‌ను కోర్టు కొట్టివేసింది. దీంతో ఆర్డీవోపై ప్రభుత్వం సస్పెన్షన్‌ను ఎత్తివేసింది. ఆ ఇద్దరి తహసీల్దార్లకు పోస్టింగ్ ఇవ్వాలని సీసీఎల్‌ఏ ఆదేశించింది.

టీటీడీ బోర్డు ఎక్స్ అఫిషియో సభ్యుడిగా నేడు ఈవో ప్రమాణం

తిరుమల, నవంబరు16(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఆదివారం టీటీడీ ఈవో శ్యామలరావు ప్రమాణం చేయనున్నారు. ఇటీవల టీటీడీ బోర్డుకు ప్రభుత్వం బీఆర్ నాయుడు ఛైర్మన్‌గా, మరో 24 మందిని సభ్యులుగా నియమించిన విషయం తెలిసిందే. ఇందులో మాజీ సీజే హెచ్‌ఎల్ దత్తు మినహా మిగిలిన సభ్యులందరూ ప్రమాణస్వీకారం చేశారు. సోమవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో తొలి బోర్డు సమావేశం జరుగనుంది. ఈక్రమంలో ఈవో ఆదివారం ప్రమాణస్వీకారం చేయనున్నారు.



తిరుమల ఘాట్‌లో ఇనుపకంచె ఏర్పాటు

తిరుమల, నవంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం కూడా జల్లులు పడ్డాయి. వారం రోజులుగా పడుతూనే ఉంది. దీంతో తిరుమల రెండో ఘాట్‌రోడ్డు ప్రమాదకరంగా మారింది. పలు ప్రాంతాల్లో చిన్నపాటి రాళ్ల రోడ్డుపై పడుతున్నాయి. 8వ కిలోమీటరు వద్ద కొండచరియలు ప్రమాదకరంగా ఉన్న నేపథ్యంలో ఇంజినీరింగ్ సిబ్బంది సిమెంట్ వేసి ఇనుపకంచెను ఏర్పాటు చేస్తున్నారు. కొండచరియలు విరిగిపడేందుకు అవకాశమున్న ప్రాంతాలపై టీటీడీ అధికారులు నిఘా పెట్టారు.

ముక్కంటిని దర్శించుకున్న శృంగేరి శంకర పీఠం ఉత్తరాధికారి

శ్రీకాళహస్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని శృంగేరి శంకరపీఠ ఉత్తరాధికారి విధు శేఖర భారతి స్వామి శనివారం శిష్య బృందంతో కలిసి దర్శించుకున్నారు. స్వామివారి రాకతో శ్రీకాళహస్తి పట్టణంలో పెద్దఎత్తున కాషాయ జెండాలు రెపరెపలాడాయి. ఒకరోజు ముందు నుంచే ఆయన విచ్చేసే మార్గమైన రామసేతు వంతెన నుంచి ఆలయం వరకు కాషాయ జెండాలు, స్వాగతతోరణాలు ఏర్పాటు చేశారు. ఇకస్వామివారు పట్టణానికి ప్రవేశించిన వెంటనే రామసేతు వంతెన నుంచి ఆలయం వరకు మహిళల కోలాట నృత్యం, భజనలు, వేదపండితులు మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాలు, మేళతాళాలతో అఖండ స్వాగతం పలికారు. ఇక ఆలయం సమీపంలోని భిక్షాల గాలిగోపురం వద్ద ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆయన సతీమణి రిషితారెడ్డి అధికారులతో కలిసి ఆహ్వానించారు. రంగుల గోపురం నుంచి ప్రవేశించిన ఆయన స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఎమ్మెల్యే దంపతులు శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను బహూకరించారు. అనంతరం స్వామివారు అక్కడే ఆశీనులై అందరికి ఆశీర్వాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, అనువంశిక ప్రధాన అర్చకుడు డాక్టర్ స్వామినాథన్ గురుకుల్ తదితరులు పాల్గొన్నారు.

స్వామీజీకి తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఎమ్మెల్యే



కలుషిత ఆహారం తిని 32 మందికి అస్వస్థత



విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న సూపరింటెండెంట్ రవిప్రభు

- అర్ధరాత్రి 17 మంది రుయాకు తరలింపు
- మరో 15 మందికి వసతిగృహంలోనే వైద్యం
- గిరిజన వసతి గృహంలో ఘటన

తిరుపతి(వైద్యం/విద్య), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి న్యూ బాలాజీ కాలనీలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల వసతి గృహంలో ఆహారం కలుషితమై శుక్రవారం రాత్రి 32 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. సుమారు 10 గంటల సమయంలో కడుపు నొప్పితో మొదలై విరోచనాలు, తల నొప్పి, కళ్లు తిరగడంతో అధికారుల దృష్టికి వాచ్ ఉమెన్ తీసుకెళ్లారు. అర్ధరాత్రి దాటాక 17 మంది విద్యార్థినులను 108 వాహనాల్లో రుయాకు తరలించారు. రుయా అధికారులను, డీఎంహెచ్‌వో శ్రీహరిని కలెక్టర్ వెంకటేశ్వర్ అప్రమత్తం చేయడంతో వాళ్లంతా ఆస్పత్రికి చేరుకొన్నారు. మెడిసిన్ వార్డులో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి వైద్య చికిత్సలు అందించారు. శనివారం మధ్యాహ్నానికి విద్యార్థులు కోలుకున్నారు. ఇద్దరు మినహా మిగిలిన 15 మందిని డిశ్చార్జి చేశారు. శనివారం ఉదయానికి మరో 15 మంది స్వల్పంగా అస్వస్థతకు గురవంతో వసతి గృహంలోనే వారికి చికిత్స అందించారు. ప్రస్తుతం అందరూ బాగున్నారని వైద్యాధికారులు వెల్లడించారు.

ఆహారంలో బల్లి?

ఏం జరిగింది, ఏమి తిన్నారు, ఆహారం ఎలా ఉందని విద్యార్థులను శుక్రవారం రాత్రి వైద్యులు ఆరా తీయగా విస్తుపోయే విషయాలు చెప్పారు. భారతీయ అటవీ జాతుల స్వాతంత్ర్య సమర యోధుడు బిర్సా ముండా జయంతి సందర్భంగా గిరిజన భవన్‌లో శుక్రవారం గిరిజన స్వాభిమాన ఉత్సవాలు జరిగాయి. మధ్యాహ్నం గిరిజన సంక్షేమ పాఠశాల, కళాశాలల వసతి గృహాల విద్యార్థులకు పప్పు, గుత్తివంకాయ, బఠానీ కూర, కోడిగుడ్ల పులుసు వడ్డించారు. రాత్రి పాఠశాల విద్యార్థులకు వసతి గృహంలోనే భోజనం పెట్టారు. పప్పు కూరలో బల్లి లాగా ఏదో కనిపించిందని, దానిని పడేశానని ఓ విద్యార్థిని తోటి విద్యార్థులతో చెప్పినట్టు విద్యార్థినులు చెప్పారు. ఇలా అప్పుడప్పుడూ ఆహారంలో కీటకాలు కనిపిస్తుంటాయని, సిబ్బందిని అడిగితే తిడతారని, అందువల్ల తాము వాటిని తీసేసి తినేస్తుంటామని చెప్పారు. మధ్యాహ్నం వడ్డించగా మిగిలిన కోడిగుడ్ల పులుసును రాత్రి మళ్లీ వేశారని, అప్పటికే కోడిగుడ్లు చెడిపోయి వాసన వస్తున్నట్లు తెలిపారు. వాటిని విద్యార్థులకు వడ్డించడం, సిబ్బందికి భయపడి వారు తినేయడం అనారోగ్యానికి కారణంగా కనిపిస్తోంది. ఈ విషయాలన్నీ కొందరు విద్యార్థులు ఆంధ్రజ్యోతికి వివరించారు. ఐతే శనివారం మధ్యాహ్నానికి కొందరు మాట మార్చారు. వసతి గృహ అధికారులు భయపెట్టడంతోనే విద్యార్థులు మాటమార్చినట్టు విమర్శలున్నాయి.



వసతి గృహంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఈవో కుమార్

కాగా, రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ పరామర్శించారు. ఏం జరిగిందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు భాస్కర్, హేమంత్, వెంకటేష్, రమణ తదితరులు పాల్గొన్నారు. గిరిజన సంఘాల నాయకులు వసతి గృహంవద్దకు చేరుకుని ఆందోళన నిర్వహించారు. ఆహార పదార్థాలను పరిశీలించారు. బియ్యం సహా కూరగాయలు, ఉల్లిపాయలన్నీ నాసిరకంగా, కుళ్లిపోయి ఉన్నాయని సిబ్బందిని, అధికారులను నిలదీశారు.

సొనకాలువలో పడి ఇద్దరు చిన్నారుల మృతి

- ఏరూరు అల్లీపురంలో విషాదం



మృతిచెందిన చింతాలయ్య - నాగేంద్రమ్మ

చిల్లకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం ఏరూరు అల్లీపురం ఎస్టీకాలనీకి చెందిన ఇద్దరు చిన్నారులు ప్రమాదవశాత్తు సొన కాలువలో పడి మృతిచెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్టీ కాలనీకి చెందిన నాగేంద్ర, చెంచమ్మ దంపతుల కుమార్తె నాగేంద్రమ్మ(11), ఏడుకొండలు, రాములమ్మ దంపతుల కుమారుడు చింతాలయ్య(10) పాఠశాలకు వెళ్లడంలేదు. శనివారం మధ్యాహ్నం నాగేంద్రమకమ తల్లి సొన కాలువ వద్ద బట్టలు ఉతికేందుకు వెళతుండగా ఆమెతో పాటు నాగేంద్రమ్మ, చింతాలయ్య కూడా వెళ్లారు. అక్కడున్న కొందరు పిల్లలతో కలిసి సరదాగా వీరు సొన కాలువలోకి దిగారు. నాగేంద్రమ్మ, చింతాలయ్యకు ఈత రాకపోవడంతో నీట మునిగిపోయారు. గమనించిన స్నేహితులు కేకలు వేయడంతో స్థానికులు కాలువలోకి దిగి చిన్నారులను వెలుపలకు తీసుకొచ్చారు. అప్పటికే వీరిద్దరూ మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని సందర్శించి చిన్నారుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్‌బాబు చెప్పారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్, పెంచలకోన ఆలయ మాజీ చైర్మన్ తానంకి నానాజి కలిసి మృతుల ఒక్కో కుటుంబానికి రూ.పది వేల చొప్పున పార్టీ నేతల ద్వారా అందజేశారు.

మినీ కేంద్రాలను మెయిన్‌గా మార్చాలి

- కలెక్టరేట్ వద్ద అంగన్వాడీల ఆందోళన



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు, సీపీఎం నాయకులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చాలని అంగన్వాడీలు డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద శనివారం వర్షంలోనే ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, కార్యదర్శి జయచంద్ర మాట్లాడుతూ.. మినీ అంగన్వాడీ కేంద్రాలకు హెల్పర్ ఒక్కరే ఉండటంతో వారిపై పనిభారం పెరిగిపోతుందన్నారు. వారికి మెయిన్ వర్కర్లుగా పదోన్నతి ఇవ్వాలని జీవో ఉన్నా ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు అమలుచేయాలని కోరారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో అంగన్వాడీ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పద్మలీల, ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి, శ్యామల, ఇంద్రాణి, సీఐటీయూ నుంచి మునిరాజ, లక్ష్మి, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

తిరుమలలో నేడు కార్తీక వనభోజనం

- వైభవోత్సవ మండపానికి మారిన వేదిక

తిరుమల, నవంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుమలలో కార్తీక వనభోజన కార్యక్రమాన్ని శ్రీవారి ఆలయం ముందున్న వైభవోత్సవం మండపంలో ఆదివారం నిర్వహించనున్నారు. సాధారణంగా పార్వేట మండపంలో నిర్వహించడం ఆనవాయితీ. వర్షాల నేపథ్యంలో ఈసారి వైభవోత్సవ మండపంలో నిర్వహించాలని టీటీడీ నిర్ణయించింది. పవిత్రమైన కార్తీకమాసంలో వనభోజనం నిర్వహించడం టీటీడీకి ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయం శ్రీవారు ఉభయనాంచారులతో కలిసి వైభవోత్సవ మండపానికి వేంచేపు చేస్తారు. 11 నుంచి 12 గంటల మధ్య స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం స్వామి ఆలయానికి వేంచేపు అవుతారు. ఉత్సవం కారణంగా శ్రీవారి ఆలయంలో కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.



టీటీడీ చైర్మన్‌ను సన్మానిస్తున్న జేఏసీ ప్రతినిధులు

భక్తుల సేవకు పూర్తిస్థాయిలో సహకరిస్తాం

తిరుపతి అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తిరుమల వచ్చే భక్తులకు సేవలందించడంలో పూర్తిస్థాయిలో సహకరిస్తామని టీటీడీ ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు టీటీడీ ధర్మకర్తల మండలి చైర్మన్ బీఆర్ నాయుడుకి తెలియజేశారు. తిరుపతిలోని పద్మావతి గెస్ట్‌హౌస్‌లో శనివారం చైర్మన్‌ను టీటీడీ జేఏసీ గౌరవాధ్యక్షుడు రవి(ఏఈవో), అధ్యక్షుడు ఆంజనేయుల బృందం మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. అనంతరం శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ప్రధాన కార్యదర్శి మల్లం విజయ్‌కుమార్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉపేంద్రనాయుడు, ఉపాధ్యక్షులు డాక్టర్ బెల్లంకొండ ప్రసాద్, జాయింట్ సెక్రటరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో భారీ వర్షం



తిరుపతి అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శుక్రవారం నగరంలో పలుమార్లు వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్ర వరకు విడతల వారీగా జోరువాన కురిసింది. రోడ్లు, లోతట్టుప్రాంతాలు జలమయమయ్యాయి. కాలువలు పొంగి పొర్లాయి. బస్టాండు, రైల్వే అండర్ బ్రిడ్జిలలో నీరు నిలిచిపోయింది. కూరగాయల మార్కెట్ రొచ్చురొచ్చుగా మారింది. వీధి వ్యాపారాలు స్తంభించాయి. భవన నిర్మాణాలు, అభివృద్ధి పనులకు ఆటంకం కలిగింది. అక్కడక్కడా చెట్లు, కొమ్మలు నేలకూలాయి. పలుమార్లు విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

ముంతాజ్ హోటల్ అనుమతులు రద్దు చేయండి

- హిందూ ధర్మ పరిరక్షణ సంఘాల డిమాండ్

తిరుపతి(లీలామహల్), నవంబరు16(ఆంధ్రజ్యోతి): హిందువుల మనోభావాలకు విరుద్ధంగా జూపార్క్ రోడ్డులో నిర్మిస్తున్న ముంతాజ్ హోటల్‌కు అనుమతులు వెంటనే రద్దు చేయాలని తిరుక్షేత్రాల రక్షణ సమితి, రాయల్ పీపుల్ ఫ్రంట్‌ల అధ్యక్షులు తుమ్మా ఓంకార్, రెడ్డిశేఖర్‌రాయల్ డిమాండ్ చేశారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో వారు వేర్వేరుగా మాట్లాడారు. 2021లో వైసీపీ ప్రభుత్వ టీటీడీ పవిత్రతను దెబ్బతీయడానికి జూపార్క్‌కు ఆనుకుని ఉన్న దేవలోక్‌లో 60 ఎకరాల్లో 20 ఎకరాలు ముంతాజ్ (ఒబెరాయ్ (గ్రూపు) హోటల్‌కు కేటాయించిందన్నారు. 100 విల్లాలతోపాటు మద్యం, మాంసం, స్పా, స్విమ్మింగ్‌పూల్ లాంటి విదేశీ సంస్కృతిని పెంపొందించే ఈ ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. ఈ నెల 18న జరగనున్న టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో చర్చించి హోటల్‌కు కేటాయించిన స్థలాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశాల్లో సనాతన ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షులు చీనేపల్లె కిరణ్, రమాదేవి, మల్లీశ్వరి, కేశవులు, నీలకంఠ, ధనుంజయ్, రాయల్ పీపుల్ ఫ్రంట్ సభ్యులు హేమంత్‌కుమార్, వేణురాయల్, పవన్‌కుమార్‌రాయల్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై విస్తృత దాడులు

- ముగ్గురు మద్యం విక్రేతల అరెస్టు
- 37 మద్యం బాటిళ్ల సీజ్

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ అధికారులు శనివారం బెల్టుషాపులపై దాడులు చేశారు. జిల్లా ఎక్సైజ్ ఈఎస్ నాగమల్లేశ్వర రెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వాసుదేవ చౌదరి పర్యవేక్షణలో ఈ తనిఖీలు జరిగాయి. చంద్రగిరి, పుత్తూరు, తిరుపతి రూరల్, తిరుపతి ఎక్సైజ్ అధికారులు, టాస్క్‌ఫోర్సు సిబ్బంది బృందాలుగా విడిపోయి అన్ని మండలాల్లో దాడులు చేశారు. ఎర్రావారిపాలెం మండలం కుమ్మరపల్లి గ్రామానికి చెందిన నారాయణ, చిన్నగొట్టిగల్లు మండలం మారసానివారిపల్లికి చెందిన సహదేవయ్య, చంద్రగిరి గ్రామానికి చెందిన ముబారక్ అనధికారికంగా మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నారు. వారి నుంచి 37 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కాగా, గత 15 రోజుల్లో వివిధ ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి 18 కేసులు నమోదు చేశారు. దాదాపు 18 బెల్టు దుకాణాలపై తనిఖీలు చేశారు. 412 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని 18 మంది నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎక్సైజ్ ఏఈఎస్ వాసుదేవచౌదరి చెప్పారు. ఎవరైనా బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కేసులతో పాటు భారీగా జరిమానా విధించి.. పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐలు ఫణీంద్ర, నరసనాయుడు, మురళీమోహన్, శ్యాంప్రసాద్, సిబ్బం ది పాల్గొన్నారు.



దాడుల్లో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో అధికారులు, సిబ్బంది

స్టే ఉన్నా సామాన్ల తొలగింపు

- అడ్డుకున్నందుకు దాడి చేశారంటూ మహిళ ఫిర్యాదు

తిరుపతి (నేరవిభాగం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అద్దె స్థలం విషయమై కోర్టు స్టే ఉన్నా.. యజమాని సామాన్లు తొలగించారని, అడ్డుకున్నందుకు తనపై దాడి చేశారంటూ ఓ మహిళ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతి రూరల్ మండలం గాంధీపురంలో ఈ ఘటన చోటు చేసుకుందన్నారు. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. అనంతపురం ధర్మవరానికి చెందిన యశోదమ్మ కుటుంబీకులు జీవనోపాధి కోసం తిరుపతికి వచ్చారు. ఎంఆర్‌పల్లికి చెందిన రాజేశ్వరరావు, సరోజినీదేవి దంపతుల నుంచి సర్వే నెంబరు 15లో ఉన్న భూమిని అద్దెకు తీసుకున్నారు. దాదాపు రూ.50 లక్షలు వెచ్చించి ఎల్‌వీ పవర్‌లూమ్స్ అండ్ హ్యాండ్ లూమ్స్ ఏర్పాటు చేసుకున్నారు. పట్టుచీరల తయారీకి సంబంధించి మిషన్లు, కరెంటు, హ్యాండ్ ల్యూమ్ మగ్గాలు ఏర్పాటు చేశారు. అదే స్థలంలో గోడౌన్ పెట్టుకున్నారు. అద్దెకు సంబంధించి అగ్రిమెంటు చేసుకున్నారు. మూడు నెలల క్రితం స్థలం ఖాళీ చేయాలని యజమాని ఒత్తిడి తేగా, బాధితురాలు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. ఈ క్రమంలో శనివారం స్థలం యజమాని మిషనరీలు, ఇతర పరికరాలు తొలగిస్తుండగా బాధితురాలు యశోదమ్మ అడ్డుకున్నారు. ఈ ఘర్షణలో స్థలం యజమాని రాజేశ్వరరావు, మరి కొంతమంది దాడి చేసి గాయపరిచారంటూ బాధితురాలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తిరుమల బార్బర్ క్వార్టర్స్ వద్ద అగ్నిప్రమాదం



పూర్తిగా కాలిపోయిన షెడ్

తిరుమల, నవంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుమలలోనే బార్బర్ క్వార్టర్స్ వద్ద శనివారం అగ్నిప్రమాదం జరిగింది. క్వార్టర్స్ పక్కనే కొంతమంది భవన కార్మికులు తాత్కాలికంగా రేకుల షెడ్లను ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు. ఈక్రమంలో ఒక షెడ్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. వెంటనే ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే దుస్తులు, వంట సామగ్రి కాలిపోయాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

ఏనుగుల దాడితో రైతులకు నష్టం..

- అసెంబ్లీలో ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తమ నియోజకవర్గంలో ఏనుగుల దాడితో రైతులు పంటలు తీవ్రంగా నష్టపోతున్నారని ఎమ్మెల్యే పులివర్తి చెప్పారు. శనివారం అసెంబ్లీ సమావేశంలో ఆయన ఎనుగుల సమస్యను ప్రస్తావించారు. పాకాల మండలంలో పదివట్ల బైల్లు, పేరసానిపల్లి, ఈ.పాలగుట్టపల్లి, మొగరాల, రమణయ్యగారిపల్లె, తదితర గ్రామాల్లో ఏనుగుల సంచారం తీవ్రంగా ఉందన్నారు. అటవీ అధికారులకు ఫిర్యాదు చేసామన్నారు. పంట నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎర్ర చందనం స్మగ్లర్ అరెస్టు

- 10 దుంగలు స్వాధీనం

మంగళం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం భాకరాపేట అటవీప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు ఓ స్మగ్లర్‌ను అరెస్టు చేసి 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్‌ఐ సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన ఆర్‌ఎస్‌ఐ విష్ణువర్ధన్ బృందం అటవీశాఖ అధికారులతో కలిసి శ్రీవారి మెట్టు నుంచి కూంబింగ్ నిర్వహించారు. చంద్రగిరి మండలం చీగటీగల కోన వద్ద శనివారం ఉదయం కొంతమంది ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ టాస్క్‌ఫోర్సు పోలీసులకు కనిపించారు. వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా దుంగలు పడేసి పారిపోయారు. ఒకరిని పట్టుకున్నారు. నిందితుడు తమిళనాడులోని తిరువణ్ణామలై జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పట్టుబడ్డ ఎర్రచందనంతో టాస్క్‌ఫోర్సు పోలీసులు



వీవీసీ కాటేజీ వద్ద ఆరు అడుగుల జెర్రిపోతు

తిరుమల, నవంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని వీవీసీ కాటేజీల వద్ద శనివారం ఆరడుగుల పొడవైన జెర్రిపోతు పాము పట్టుబడింది. అడవి నుంచి వీవీసీ 43 కాటేజీ వద్దకు పాము రావడాన్ని భక్తులు గుర్తించి టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్‌నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన పామును పట్టుకుని దట్టమైన అడవిలో విడిచిపెట్టారు.

ధనార్జన క్షేత్రంగా మార్చారు

- 10 శాతం కమీషన్ కోసం రూ.500 కోట్ల శ్రీవారి నిధుల దుర్వినియోగం
- టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో పవిత్రమైన ధార్మిక క్షేత్రాన్ని ధనార్జన క్షేత్రంగా మార్చి దోచుకున్నారని టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. శనివారం ఆయన బీజేపీ నాయకులతో కలిసి నిర్మాణంలో ఉన్న టీటీడీ గోవిందరాజుల సత్రాలను పరిశీలించారు. 2016లో రూ.10 కోట్లు వెచ్చించి మరమ్మతులు చేసిన సత్రాలను ఇప్పుడు మళ్లీ తిరిగి నిర్మించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. శ్రీవారి నిధులను కాజేసేందుకే గత ప్రభుత్వ పెద్దలు ఈ నిర్మాణాలను ప్రారంభించారని అనుమానం వ్యక్తం చేశారు. నూతన భవన నిర్మాణాల పేరుతో రూ.500 కోట్ల శ్రీవారి నిధులను దోచుకుతిన్నారని దుయ్యబట్టారు. శ్రీవారిపై భక్తితో భక్తులు సమర్పించిన కానుకలను కమీషన్ల పేరుతో కాజేసేందుకే వైసీపీ నేతలు ఈ నిర్మాణ పన్నాగం పన్నారన్నారు. 2019 నుంచి 2024 వరకు టీటీడీలో జరిగిన ఆర్థిక వ్యవహారాలపై టీటీడీ చైర్మన్‌తో చర్చించి, ఆయన అనుమతితో ఒక కమిటీ వేసేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి పొనగంటి భాస్కర్, తిరుపతి అసెంబ్లీ కన్వీనర్ అజయ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, నాయకులు సుబ్బుయాదవ్, జీవన్ రాయల్ తదితరలు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న భానుప్రకాష్‌రెడ్డి

జీఎన్‌టీ రోడ్డుకు మరమ్మతులు



గుంతలు పూడ్చిన అనంతరం జీఎన్‌టీ రోడ్డు

సూళ్లూరుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని జీఎన్‌టీ రోడ్డుకు ఎట్టకేలకు అధికారులు స్పందించి మరమ్మతులు చేస్తున్నారు. స్థానిక హోలీక్రాస్ సెంటర్ నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు వరకు జీఎన్‌టీ రోడ్డు గోతులు ఏర్పడి ప్రయాణం నరకప్రాయంగా మారింది. చిన్నపాటి వర్షమొచ్చిన నీరు నిలబడి వాహనాలు వెల్లలేని పరిస్థితి ఏర్పడింది. శనివారం ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. ఎక్స్‌కవేటర్ సాయంతో రోడ్డును తవ్వి గుంతలను పూడ్చే పనులు ప్రారంభించారు. ప్రస్తుతానికి ప్రయాణికులకు, వాహనాలకు ఇబ్బందులు లేకుండా తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్నట్లు ఆర్‌అండ్‌బీ డీఈ పరమేశ్వరి తెలిపారు.

ప్రభుత్వం హామీలను వెంటనే అమలు చేయాలి

గూడూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మూడు సెంట్లు, పట్టణంలో రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలను కేటాయించడంతో పాటు ఇంటి నిర్మానికి రూ.5 లక్షల రుణం మంజూరు చేయాలని కోరారు. అలాగే రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని, విద్యుత్ చార్జీలను పెంచకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఈనెల 18వ తేదీన సచివాలయాల వద్ద నిర్వహించనున్న ధర్నాను, 26న కలెక్టరేట్ వద్ద రైతుల సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కాలేషా, ప్రభాకర్, శశికుమార్, రవి, చంద్రయ్య, నారాయణ, రమేష్, శేషయ్య, భాస్కర్, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సివిల్ జడ్జి సులోచనారాణి

గూడూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో డిసెంబరు 14వ తేదీన గూడూరు కోర్టు ఆవరణలో నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బీవీ సులోచనారాణి అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసుల శాశ్వత పరిష్కారానికి రాజీయే రాజమార్గమన్నారు. రాజీ అయ్యే కేసులను లోక్‌అదాలత్ ద్వారా కక్షిదారులు పరిష్కరించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో వివిధశాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ టవర్ నిర్మాణ స్థలం పరిశీలన

పెళ్లకూరు, నవంబరు 16, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నేపల్లి వద్ద 71వ జాతీయ రహదారి పక్కనే పంటకాలువ స్థలంలో హైలెవల్ విద్యుత్ టవర్ నిర్మాణ స్థలాన్ని తహసీల్దారు ద్వారకానాథ్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ మహేష్ శనివారం పరిశీలించారు. 71వ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా టవర్ నిర్మాణం చేపడుతున్నారు. పంట కాలువపై హైటెన్షన్ టవర్ నిర్మాణం చేపట్టవద్దంటూ రైతులు ఆందోళన చేయడంతో అధికారులు పరిశీలించారు. వీఆర్వో సుమతి, సర్వేయర్లు సూర్యనారాయణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

నాయుడుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న పెంచలయ్య శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. నాయుడుపేట బిరదవాడలోని పెంచలయ్య స్వగృహంలో ఆయన మృతదేహానికి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు చాపల వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెంచలయ్య కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించడంతో పాటు కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు.

ల్యాబ్, ఖోఖో కోర్టు నిర్మాణాల తనిఖీ

కోట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడులోని యానాదుల గురుకుల ప్రాంగణంలో ఖోఖో కోర్టు, ల్యాబ్ నిర్మాణ పనులను శనివారం ఎంఈవో మస్తానయ్య తనిఖీ చేశారు. ఆయా భవనాల నిర్మాణాలకు వినియోగిస్తున్న సిమెంట్, ఇనుప ఊచలను పరిశీలించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

రేషన్ బియ్యం స్వాధీనం

గూడూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టిడ్కో గృహాల సమీపంలో శనివారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ వివరాల మేరకు... మండలంలోని కొండాగుంట గ్రామం నుంచి ఆటోలో 500 కేజీల రేషన్ బియ్యాన్ని అక్రమంగా గూడూరు వైపు తరలిస్తుండగా టిడ్కో గృహాల సమీపంలో పట్టుకోవడం జరిగిందన్నారు. గాంధీనగర్ ప్రాంతానికి చెందిన వెంకటేశ్వర్లు, ఆటో డ్రైవర్ రమణయ్యను అదుపులోకి తీసుకొని, రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు ఢీకొని లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

చిల్లకూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోట క్రాస్‌రోడ్డు సమీపంలో శనివారం కారు ఢీకొనడంతో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... పులివెందులకు చెందిన జగన్మోహన్‌రెడ్డి లారీడ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కడప నుంచి కృష్ణపట్నం పోర్టు లారీని తీసుకువెళుతూ కోట క్రాస్‌రోడ్డు సమీపంలో ఆపాడు. రోడ్డు దాటుతుండగా నాయుడుపేట వైపు నుంచి నెల్లూరు వైపు వెళుతున్న కారు ఢీకొనడంతో జగన్మోహన్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్త గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగురిపై కేసు

సూళ్లూరుపేట, నవంబరు 16: దుకాణానికి ఆ భవనం యజమాని ఉమామహేశ్వర రెడ్డి దౌర్జన్యంగా తాళాలు వేసి ఇబ్బంది పెట్టారని దుకాణ నిర్వాహకుడు భగవాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఉమామహేశ్వరెడ్డి, శేషయ్య, మునిరత్నం, లక్ష్మయ్య, మనోహర్, మునస్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బ్రహ్మనాయుడు తెలిపారు. అలాగే భవనం యజమాని ఉమామహేశ్వర రెడ్డి కూడా దుకాణ నిర్వాహకుడు భవగాన్‌పై ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ చెప్పారు.

బెల్టుషాపుపై దాడి
12 మద్యం బాటిళ్ల స్వాధీనం

వాకాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం పంచాయతీ వడ్డిపాళెం గ్రామంలో బెల్టుషాపుపై ఎక్సైజ్ అధికారులు చేశారు. 12 క్వార్టర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్టుషాపులు నిర్వహించినా, అక్రమంగా మద్యం తరలించినా చర్యలు తీసుకుంటామన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మూడో వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్తలు పెంచలయ్య, గౌస్‌బీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబాలకు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సహకారంతో టీడీపీ నాయకులు రూ.3వేల చొప్పు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో తక్కెళ్లపాటి చంద్రమౌళి, షైనంపాటి మోహన్, పచ్చవ శ్రీధర్‌నాయుడు, సురేష్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంగయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైద్యఖర్చులకు ఆర్థిక సాయం

చిల్లకూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక దళితవాడకు చెందిన శైలజకు శనివారం మండలంలోని చేడిమాలకు చెందిన రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. శైలజ అనారోగ్యంతో నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స తీసుకుంటోంది. వారిది పేద కుటుంబం కావడంతో ట్రస్టు ఫౌండర్ రాజనేని శ్రీనివాసులు నాయుడు ఆమె వైద్యఖర్చులకు రూ.10వేలు అందజేశారు. ఈ నగదును ట్రస్టు ప్రతినిధి బాబు శైలజ కుటుంబ సభ్యులకు అందజేశారు.

చెకుముకి విజేతలకు బహుమతులు

గూడూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎల్‌ఏపీ పాఠశాలలో శనివారం గూడూరు, చిల్లకూరు మండలాల స్థాయిలో చెకుముకి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మెమొంటోలను అందజేశారు. జనవిజ్ఞాన వేదిక పట్టణాధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చదువులపై శ్రద్ధచూపి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో సురేష్, నాగరాజు, చెంచునారాయణ, శ్రీనివాసాచారి, పురుషోత్తమరావు తదితరులు పాల్గొన్నారు.





గూడూరు చర్చివీధి, చెన్నూరులో గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

బయటకొస్తే భౌ అంటున్నాయి

- హడలెత్తిస్తున్న వీధి కుక్కలు
- నెల రోజుల్లో 35 మందికి కుక్కకాటు

గూడూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణంలోని వీధికుక్కల బెడద పెరిగిపోతుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా నిత్యం వీధుల్లో వీధి కుక్కలు సంచరిస్తుండడంతో స్థానికులు బయటకు రావాలంటే హడలిపోతున్నారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో వీధిదీపాలు సక్రమంగా వెలగడం లేదు. దీంతో రాత్రి సమయంలో చీకటిగా ఉండడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇంటికి వెళ్లే సమయంలో వీధికుక్కలు వెంటబడుతున్నాయి. చిన్నారులు వీధుల్లో ఆటలు ఆడుకునేటప్పుడు, ట్యూషన్ల నుంచి ఇంటికి వెళ్లే సమ యంలో వీధి కుక్కలు తరుముతుండడంతో భయాందోళనలకు లోనవుతున్నారు. ఉదయం, సాయంత్రం స్టేడియంలో వాకింగ్ చేసేందుకు వెళ్లే వారూ కుక్కలతో ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలలో వెళ్లేటప్పుడు వీధికుక్కలు ఒక్కసారిగా తరుముకుంటూ వస్తుండడంతో ప్రమాదాలకు లోనవుతున్నామని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో, వేకువజామున రైల్వేస్టేషన్, బస్టాండుకు వెళ్లాలన్నా కుక్కలు వెంటబడి తరుముతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. ప్రధానంగా పాతబస్టాండు, టవర్‌క్లాక్ సెంటర్, ఐసీఎస్ రోడ్డు, మసీదువీధి, అశోక్‌నగర్, మాళవ్యానగర్, గాంధీనగర్, చర్చి వీధి, చెన్నూరు, కుమ్మరవీధి తదితర ప్రాంతాల్లో వీధికుక్కల బెడద అధికంగా ఉంది. ఇటీవల మసీదువీధికి చెందిన ఆరేళ్ల చిన్నారి రాత్రి సమయంలో శివాలయం వీధిలో ఆడుకుని ఇంటికి వెళుతుండగా ఓ వీధికుక్క దాడి చేయడంతో గాయాలపాలైంది. స్టేడియంలో వాకింగ్ చేస్తున్న సమయంలో ఓ వ్యక్తిని కుక్క కరిచి గాయపరిచింది. తహసీల్దారు కార్యాలయం వద్ద ఓ కుక్క దాడి చేయడంతో ఇద్దరికి గాయా లయ్యాయి. ఈ నెల రోజుల్లో సుమారు 35 మంది వరకు కుక్కకాటుతో గాయపడి గూడూరు, చెన్నూరు ప్రభుత్వాస్పత్రుల్లో రేబిస్ వ్యాక్సిన్‌లను వేయించుకున్నారంటే సమస్య ఎంత జఠిలంగా ఉందో అర్థమవుతుంది. గతంలో తిరుపతికి చెందిన ఓ ప్రైవేటు సంస్థ సహకారంతో గూడూరు పట్టణంలో వీధి కుక్కలను పట్టుకుని వాటి సంతానోత్పత్తి నిలిచిపోయేలా ఇంజక్షన్లు వేసేవారు. దీంతో వీధికుక్కల పెరుగుదల కొంతమేర తగ్గేది. కొవిడ్ తర్వాత వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టలేదు. దీంతో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయి దాడులకు దిగుతున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సివిల్ జడ్జి అనూషా

బాలాయపల్లి, నవంబరు 16,(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా ముందుకు సాగాలని వెంకటగిరి సివిల్ జడ్జి అనూషా అన్నారు. శనివారం స్థానిక వెంగమాంబపురం హైస్కూల్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేక చట్టాలను తీసుకువచ్చిందన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకుని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం బాలుర హాస్టల్‌ను తనిఖీ చేశారు. భోజనం, వసతుల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గాంధీ, రాజేష్, రాజారావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

వెంకటగిరి టౌన్/బాలాయపల్లి, నవంబరు 16,(నవంబరు): అన్ని పంచాయతీలను అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎంపీడీవో కోటీశ్వరరావు అన్నారు. శనివారం వెంకటగిరి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందు కోసం అన్ని శాఖల అధికారులు పమన్వయంలో పనిచేయాలని కోరారు. ● బాలాయపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వినీల్ కుమార్ ఆధ్వర్యంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

రామ్మూర్తి నాయుడి మృతి బాధాకరం

వాకాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు మృతి బాధాకరమని తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి కుంచం దయాకర్ అన్నారు. రామ్మూర్తి నాయుడు చంద్రగిరి ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలకు ఎనలేని సేవలు అందించారని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని అన్నారు.

ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం

కోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కోటలోని ప్రగతి డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్‌ను 24 ఆంధ్రా బెటాలియన్ అధికారులు జగన్‌మోహన్‌రావు, ఆనంద్ శనివారం ప్రారంభించారు. ఎన్‌సీసీ పట్ల ఆసక్తి కలిగిన విద్యార్థులకు శక్తి, సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. 25 మంది ఎన్‌సీసీ క్యాడెట్లను ఎంపిక చేశారు. వారికి కళాశాల చైర్మన్ కిషోర్, లెఫ్టినెంట్ మునెయ్య అభినందించారు.

ఉపాధ్యాయులపై
కేసుల ఎత్తివేత ప్రకటన పట్ల ఎస్టీయూ హర్షం



మంత్రి నారా లోకేశ్‌తో శ్రీనివాసులు నాయుడు

వెంకటగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులపై అక్రమ కేసులను ఎత్తివేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శాసన సభలో ప్రకటించడం హర్షనీయమని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ తాళ్లూరు శ్రీనివాసులు నాయుడు అన్నారు. శనివారం ఆయన మాటాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ హక్కులను సాధించుకు నేందుకు, పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించుకునేందుకు చేసిన పోరాటాల సందర్భంగా అన్ని జిల్లాల్లో ఉపాధ్యాయ, ఉద్యోగులపై అక్రమ కేసులు పెట్టడం జరిగిందన్నారు. దీని వల్ల తమకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ మంజూరు, విదేశాల్లోని పిల్లల వద్దకు వెళ్లేందుకు వీసాలు మంజూరు కావని మంత్రి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి అక్రమ కేసులను ఎత్తివేస్తామని ప్రకటన చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ రహదారిపై ఆగిన లారీ
స్తంభించిన ట్రాఫిక్



జాతీయ రహదారిపై ఆగివున్న వాహనాలు

నాయుడుపేట టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మల్లాం జంక్షన్ కూడలి జాతీయ రహదారిపై శనివారం ఉదయం ఓ లారీ మరమ్మతులకు గురై ఆగిపోయింది. దీంతో ఇరువైపుల భారీగా వాహనాలు ఆగిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న హైవే సిబ్బంది, పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని మరమ్మతులకు గురైన లారీని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మన్నవరం కర్మాగారాన్ని ప్రారంభించాలి

వెంకటగిరి/వెంకటగిరి టౌన్, నవంబరు 16,(ఆంధ్రజ్యోతి): మన్నవరం కర్మాగారాన్ని వెంటనే ప్రారంభించాలని మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. శనివారం వెంకట గిరిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2010లో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ రూ.8000కోట్ల పెట్టుబడితో మన్నవరం కర్మాగారాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వాలు ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలిపివేశాయన్నారు. దీనివల్ల వెంకటగిరి, రాపూరు, శ్రీకాళహస్తీ తదితర ప్రాంతాల్లోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయన్నారు. ఇకనైనా మన్నవరం ప్రాజెక్టును ప్రారంభించేలా చర్యలు తీసుకుని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్ అధ్యాపకురాలికి డాక్టరేట్



ధన సెల్వీని అభినందిస్తున్న డైరెక్టర్

కోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ విభాగం ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డి.ధన సెల్వీకి డాక్టరేట్ రావడంతో శనివారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, పలువురు విభాగాధిపతులు ప్రసంశాపత్రాలు, మెమొంటోలతో అభినందించారు. ఇంటలిజెన్ పవర్ సిస్టమ్ సెబిలైజర్స్ ఫర్ ఇంప్రూమెంట్ ఆఫ్ ట్రాంసెట్ సెబిలిటీ ఇన్ మల్టీ మిషన్ పవర్ సిస్టమ్ అనే అంశంపై ధన సెల్వీ పరిశోధనలు చేసి అనంతపురం జేఎన్‌టీయూకు పంపారు. ఆమె పరిశోధనలు ఉత్తమమైనవిగా ఎంపికవడంతో డాక్టరేట్ ప్రదానం చేశారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



విద్యార్థులతో లైబ్రేరియన్ కల్యాణి

తడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తడ, వేనాడు గ్రామాల్లో గ్రంథాలయ వారోత్సవాలు శనివారం వె ు ు ద లయ్ ్యా ం ు ు. లైబ్రేరియన్ కల్యాణి పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ నెల 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో అన్నదానం

తడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చిన్నమాంబట్టు గ్రామంలో ఉన్న అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శనివారం అన్నదానం జరిగింది. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. గోపూజ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో తిరుపతి సిమ్స్ వైద్యులు, అన్నపూర్ణదేవి అన్నదాన సమాజం వ్యవస్థాపకులు కె.మునస్వామి, గ్రామపెద్దలు వేనాటి రాజారెడ్డి, పాముల పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

దుగరాజపట్నం పోర్టు నిర్మాణం చేపట్టాలి



ధర్నా నిర్వహిస్తున్న మాజీ ఎంపీ చింతామోహన్

గూడూరు/నాయుడు పేట, నవంబరు 16 రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న విధంగా వాకాడు మండలంలోని దుగరాజపట్నం వద్ద పోర్టు నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. శనివారం గూడూరు టవర్‌క్లాక్ కేంద్ర వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుగరాజపట్నం పోర్టు నిర్మాణం పూర్తయితే గూడూరు నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. కార్యక్రమంలో రామకృష్ణారావు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు. ● నాయుడుపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద దుగరాజపట్నం పోర్టు నిర్మాణం చేపట్టాని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవచూపి దుగరాజపట్నం ఓడరేవు నిర్మాణం చేపడితే ఈ ప్రాంత అభివృద్ధి చెందడంతో పాటు వేలాదిమందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాడి వెంకటయ్య, నాగూరయ్య, శివ పాల్గొన్నారు.

కార్తీక దీపారాధన



కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

గూడూరు అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో కార్తీక దీపారాధన మహోత్సవం నిర్వహిస్తున్నారు. శనివారం స్థానిక మాళవ్యానగర్ సెంటర్‌లో ఇస్కాన్‌కు చెందిన బలభద్రగోపదాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో కార్తీక దీపారాధన మహోత్సవం నిర్వహించారు. భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో సునీల్, రాజా, వర్మ, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరాలయంలో
శిఖరదీప ఆవిష్కరణ

కోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని సోమేశ్వర ఆలయంలో శనివారం రాత్రి కార్తీక మాసాన్ని పురస్కరించుకొని శిఖరదీప ఆవిష్కరణలు జరిగాయి. భక్తులు శిఖరదీపానికి హారతులు పడుతూ ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.



శిఖరదీపాన్ని లాగుతున్న భక్తులు